
2వ పేజీలో...

## మంత్రి తుమ్మలకు మచ్చ రాబోతోందా...?

తన రాజకీయ జీవితమంతా రైతులకోసమే..

సీతారామ ప్రాజెక్టు ఆది నుండి ఈనాటి దాకా...

అన్నీ తానై పర్యవేక్షించిన తుమ్మల

నేడు సీతారామ కెనాల్ ను పూడ్చుతున్నదెవరు..?

జరిగే విధ్వంసానికి,వినాశనానికి బాధ్యులెవరు...?

అధికారులు ఇన్స్ పెక్షన్ రోడ్లపై ప్రయాణించగలరా...!

అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 27


# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# వార్త

మంగళవారం 28, జులై 2026 16 పేజీలు


# ఇది పనికి మాలిన భూ సేకరణ

## సీతారామా పిల్లకాలువల ఆలోచన వృధాప్రయాస

తమ భూములు ఇవ్వబోమని స్పష్టీకరణ

అధికారులపై గిరిజనుల తిరుగుబాటు

ఎవర్ని ఉద్ధరించడానికంటూ నిలదీత

పెండింగ్ కాంపెన్సేషన్కోసం డిమాండ్లు

రూ.40లక్షలకు పెంచాలని విజ్ఞప్తులు

అసలు "పెసా" ఎక్కడుందన్న ఓ అధికారిపై అభిశంసన

ఈయన వ్యాఖ్యలపై ఉన్నతస్థాయిలో ఫిర్యాదుకు రంగం సిద్ధం

ఎంఎల్ఏ జోక్యంతో పరిస్థితి చక్కబడుతుందా





అశ్వారావుపేట/దమ్మపేట, ప్రభాతవార్త : దమ్మపేట మండలంలో సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కోసం సర్కార్ చేపట్టిన "పిల్లకాలువల భూసేకరణ ప్రక్రియ" కి పురిట్లోనే సంధి రోగం తగులుకుంది. అంకంపాలెం, పట్వారిగూడెం, బాలరాజుగూడెం, పెదగొల్లగూడెం, లచ్చాపురం, నాచారం, జగ్గారం, గ్రామాల పరిధిలో మొత్తం 366.37 ఎకరాలకు ఎక్వయిర్ చేసేందుకు పోయిన ఏడాది మే నెలలో ఎస్డిసి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆర్సి నెంబర్: డి1572024తేది:12.05.2025 ద్వారా 6,7 ప్యాకేజీ విభాగాల్లో ఈ కాలువల తవ్వకాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా పైన పేర్కొన్న గిరిజన గ్రామాల ప్రజలంతా దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

2వ పేజీలో...

# ఖమ్మం నగరాభివృద్ధికి మంత్రి తుమ్మల కృషి


2 లో..



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలపై ప్రత్యేక దృష్టి

ఖమ్మం దాహార్తి తీర్చేందుకు రూ.200 కోట్లు

వరద గండం నుంచి విముక్తికి రూ.250 కోట్లు

రెండు కీలక పథకాలపై మంత్రి తుమ్మల క్షేత్రస్థాయి సమీక్ష

ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త: నగరంలో అమృత్ 2.0 పథకం కింద రూ.100 కోట్ల నిధులతో నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 9 కి.మీ మేర 475 మ్యాన్ హోల్స్ 7 డివిజన్లకు అనుసంధానం.. ఖమ్మం నగరపాలక సంస్థ (కేఎంసీ) పరిధిలోని 1.80 లక్షల ఇళ్లకు వరద ముప్పు తప్పించేందుకు రూ.87 కోట్లతో

# ఖమ్మం నగర నడిబొడ్డులో మోసాలతో.. అక్రమ కట్టడం!



నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు నిర్మాణం

ఫైర్ సేఫ్టీ నిబంధనలకు నీళ్లు

అసలు స్థల యజమానికే టోకరా పెట్టిన కేటుగాడు

ఖమ్మం క్రైమ్,ప్రభాతవార్త : ఖమ్మం నగరం నడిబొడ్డులో ఓ అక్రమ భవన నిర్మాణం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తుంది. స్థానిక బుర్హాన్ పురం ప్రాంతంలో 437 గజాల స్థలాన్ని ఎటువంటి నగదు చెల్లించకుండా మాయమాటలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు ఆరోపిస్తూ న్యాయం కోసం పోలీసులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో నిబంధన ప్రకారం భవన నిర్మాణాలు సాగించాల్సిన సదరు వ్యక్తులు నిబంధ నలు తుంగలో తొక్కి వారు ఇష్టాను సారం గా ఫ్లోర్ల మీద ఫ్లోర్లు పెంచుకుం టూ పోతున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన కార్పొరేషన్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తప్పుడు పత్రాలతో బ్యాంకులో లోన్లు

అక్రమ నిర్మాణ భవనంలో ప్లాట్లు అమ్మకానికి సిద్ధమంటూ ప్రచారం

ఇప్పటికే మోసపోయి లబోదిపోమంటున్న బాధితులు

2వ పేజీలో...




# సింగరేణి సివిల్ టెండర్లలో .. గోల్మాల్..?

అవుట్సోర్సింగ్ ఉద్యోగాల అమ్మకం ఆరోపణలు..

ఒక్కో పోస్టుకు 50 వేల నుంచి లక్ష వరకు వసూళ్లు..!

కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో టెండర్ల కేటాయింపులపై అనుమానాలు

16 పోస్టులకే అనుమతి.. 21 మందికి పైగా నియామకాలు జరిగాయా..?

డబ్బులు చెల్లించిన వారికే ఉద్యోగాలు ఇస్తున్నారన్న ఆరోపణలు

2లో...

కొత్తగూడెం, జూలై 27 ప్రభాతవార్త: దేశంలోనే ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థగా పేరుగాంచిన సింగరేణి కాలరీస్ కంపెనీలో తాజాగా సివిల్ టెండర్లు, అవుట్సోర్సింగ్ కార్మికుల నియామకాలపై తీవ్ర ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. కొత్తగూడెం ఏరియాలో సివిల్ టెండర్ల

# ఇది పనికిమాలిన భూసేకరణ

## మొదటి పేజీ తరువాయి..

తమ ప్రాంతమంతా ఆయిల్‌పాం తోటలే ఆధారమని., భూగర్భజలాలతోనే పంటలు పండించుకుంటున్నప్పుడు., ఈ కాలువలు తమ తోటలగుండా వెళితే., తమకు ఎంత అసౌకర్యంగా ఉంటుందో ఆలోచించాలని.,అందువల్ల తమ భూముల్ని ప్రభుత్వానికి ఇవ్వబోమనీ.,వీళ్ళిచ్చే అరకొర డబ్బుతో తీవ్రంగా తమ కుటుంబాలు నష్టపోతాయని.,ప్రత్యేకించి గిరిజన రైతాంగం చాలా నెలలుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కాగా ఏక్విజేషన్ ప్రక్రియ ప్రస్తుతం ఊపందుకున్న స్థితిలో రైతుల ఆందోళనా అదే స్థాయిలో పతాకస్థాయికి చేరింది. ప్రతీ గ్రామంలోనూ బాధితులంతా కొద్దిరోజులుగా ప్రత్యేక సమావేశాలు పెట్టుకుని భూసేకరణ ప్రక్రియని వ్యతిరేకిస్తున్నారు. తమంతట తాముగా ఈమేరకు తీర్మానాలు చేసుకుని ఉన్నతాధికారులకు విన్నవించడమూ జరుగుతున్నది. ఈ క్రమంలో మండలస్థాయి అధికారి ఒకరు రెండు రోజుల క్రితం బాధిత రైతులపట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు వారు ఆరోపించారు. తమ వద్దకు వచ్చి..అసలు పెసా చట్టమే రద్దయిందని.,మీరింకా ఆ పాయింట్‌నే పట్టుకుని వెళ్ళాడుతుంటే మీకే నష్టమని., అందువల్ల భూములను వదిలేయడం తప్ప మీకు మరోమార్గం లేదంటూ దాదాపు బెదిరించే ధోరణిలో ప్రవర్తించడం అవమానంగా ఉన్నదని వారు ఆక్రోశం వెలిబుచ్చారు. పెసా ఏక్ట్ ఉంటుందో రద్దవుతుందో కూడా తెలుసుకోలేని అమాయకులం కాదని.,సదరు అధికారి తమను చాలా తక్కువగా అంచనా వేశారని.,ఆయనపై తాము లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తున్నామని., బాధితులు ప్రభాతవార్తకు వివరించారు. మరో కీలక అధికారి అయితే ఏకంగా "ప్రభుత్వంలోని ఓ పెద్ద పేరుని పదే పదే వల్లెవేస్తూ" ఆయన లేకుంటే మీకు ఇలాంటి సదవకాశాలే లేవని.,అసలు రావనీ అంటూ తన హోదాని మరచి మరీ భజన చేయడం ఆయనకే అంత మంచిది కాదని.,జగ్గారం కు చెందిన పలువురు రైతుబాధితులు సలహా ఇచ్చారు. పరిస్థితులు ఇలా రోజురోజుకూ దిగజారిపోతున్న క్రమంలో గిరిజన బాధితులంతా సోమవారం నాడు భద్రాచలం ఐటిడిఏ పిఓ ని కలిసి.,మండల స్థాయి అధికారుల నిరంకుశపోకడలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఐతే ఆదివారం సాయంత్రం ఎందుకైనా మంచిదని.,స్థానిక ఎంఎల్ఏ ని కలిసి విషయమంతా వివరించారు. సత్తుపల్లిలో గత్యతరం లేని పరిస్థితుల్లో నిధులను ఎన్‌టిఆర్ కాలువకు మళ్ళించుకుని పరిస్థితిని ఎలా చక్కదిద్దుకున్నారో అదేవిధంగా ఇక్కడా ఈ పిల్లకాలువల ఆలోచనను విరమించుకోవాలని., వీటివల్ల తమంతా నష్టపోతామని.,అధికారుల తీరు ఆక్షేపణీయంగా ఉన్నదని.,పరిస్థితిని నివేదించారు. దీనిపై ఎంఎల్ఏ స్పందించి ఓ మార్గాన్ని ప్రతిపాదిం చారు. ఐటిడిఏ పిఓ తో సహా ఈ భూసేకరణకు సంబంధించిన సకల యంత్రాంగంతో త్వరలో పట్వారిగూడెం ఫంక్షన్‌హాల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని.,పరస్పర చర్చల ద్వారా సమస్యకు ఏదేని పరాష్కారం దొరికితే తదనుగుణ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉన్నదని ఎంఎల్ఏ రైతులకు నచ్చజెప్పడంతో ప్రస్తుతానికి భూసేకరణ ప్రక్రియకు తాత్కాలిక విరామం. ఈ మీటింగ్ తర్వాత ఏమవుతుందో.,రైతులను ఒప్పించడంలో యంత్రాంగం ఏమేరకు సఫలమవుతుందో త్వరలో తేలుతుంది.

# ఖమ్మం నగర నడిబొడ్డులో మోసాలతో అక్రమ కట్టడం ..!

## మొదటి పేజీ తరువాయి..

### ఫైర్ సేఫ్టీ నిబంధనలకు నీళ్లు

భవన నిర్మాణం జరిగేటప్పుడు అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొంది వారి నిబంధనల ప్రకారం నిర్మించాల్సి న బహుళ అంతస్తులు అవేమీ పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా అధికారులు ఇచ్చిన ప్లాన్లు కాదని తమ సొంత ప్లానులను అమ లుపరుస్తూ భవన నిర్మాణం పూర్తి చేశాడు ఓ యజ మాని. ప్రమాదవశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం సం భవిస్తే ఇక అపార్ట్మెంట్లో నివాసం ఉండే వ్యక్తుల ప్రా ణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది.

### తప్పుడు పత్రాలు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో అనుమతులు.?

ఖమ్మం నగరంలోని బురాన్ పురం ప్రాంతంలో నిర్మించిన బహుళ అంతస్తు భవన అనుమంతులపై పలు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. స్థల యజమాని పెగళ్లపాటి సత్యనా రాయణ రావుకు బహుళఅంతస్తు భవనం నిర్మించిన సదరు వ్యక్తి మొదట చెక్కులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, చెక్కులు పలుమార్లు బౌన్స్ కావడంతో మొదట ఆ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసుకున్నారని అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుని భవనం నిర్మిస్తున్న సదరు వ్యక్తి భవనం నిర్మించిన తర్వాత అందులోని నాలుగు ఫ్లాట్లను తన వాటాగా ఇస్తానని అగ్రిమెంట్ చేయించుకు న్నాడని బాధితులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లో జతచేసిన చెక్కు నెంబర్లు ఇంతవరకు తన అకౌంట్లో జమ కాలేదని, స్థల యజమాని సత్యనారాయణరావు బ్యాంక్ స్టేట్మెంట్ ఆధారంగా చూపిస్తున్నారు.

అయితే భవన నిర్మాణానికి మున్సిపల్ శాఖ అనుమతుల కొరకు భవనం నిర్మిస్తున్న వ్యక్తి ఒక పది తనకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లో జతపర చని ఇతర చెక్కు ఆధారంగా అతని ఎకౌంట్ నుంచి సత్యనారాయణ ఎకౌంట్ కు తిరిగి సత్యనారాయణ ఎకౌంట్ నుంచి భవనం నిర్మిస్తున్న వ్యక్తి ఎకౌంటుకే నగదును ట్రాన్స్ఫర్ చేసుకుని ఈ నగదు లావాదేవీలు చూపిస్తూ కార్పొరేషన్ కార్యాలయంలో అక్రమ అనుమ తులు పొందారని బాధితులు ఆధారాలతో సహా భవనం నిర్మిస్తున్న వ్యక్తి మోసాన్ని బయట పెడుతున్నారు.

### బ్యాంకులను బురిడీ కొట్టించిన ఘనాపాటి

ఖమ్మం నగరం బురాన్ పురం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి మొదట రియల్ టర్ గా అవతారమెత్తి అనంతరం బిల్డర్ గా మారారు. తనది కాని భూమిని తనదిగా చెప్పుకుంటూ తప్పుడు పత్రాలతో బ్యాంకులను బురిడీ కొట్టించిన ఘనత ఇతడిద. 2018లో తనది కాని స్థలంలో వర్మీ కంపోస్ట్ యూనిట్ పెడుతున్నామని స్వరాజ్ బ్యాంకు నుంచి గ్రూప్ 10 లక్షలు లోన్ తీసుకుని ఆ డబ్బులు కట్టకుండా ఎగ్గొట్టడంతో సదరు బ్యాంక్ మేనేజర్ నాగరాజు ఇతడి పై ఖమ్మం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చీటింగ్ కేసులు ఇతడి పై నమోదుఅయ్యి ఉన్నాయి. యదేచ్ఛగా భూముల పేరుతో మోసాలకు పాల్పడుతూ భూ యజమానులను బ్యాంకులను బురిడీ కొట్టిస్తున్న ఇతడు పోలీసులకు ఫిర్యాదు చేస్తుంటే సివిల్ కేసులు అంటూ పక్కదారి పట్టిస్తుండడం ఇతడి పై సంబంధిత అధికారులు సైతం దృష్టి సారించ కపోవడంతో బాధితుల లిస్టు భారీగానే ఉంది.

ఇక పలు శాఖల అధికారులను మురిడి కొట్టిం చి అక్రమంగా భవనం నిర్మించి వాటిని అమా యకులకు అంటగట్టి సొమ్ము చేసుకోవాలని యో చనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని విష యాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఖమ్మం నగరాభివృద్ధికి మంత్రి తుమ్మల కృషి

## మొదటి పేజీ తరువాయి..

చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను అధికారులు వేగవంతం చేశారు. ఖానాపురం నుంచి ధాంసలాపురం చెరువు వరకు 9 కిలోమీటర్ల మేర 475 మ్యాన్ హోల్స్‌తో 7 డివిజన్లను కలుపుతూ నిర్మాణం సాగుతోంది. అయితే పుట్టకోట వద్ద 9.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించనున్న మురుగునీటి శుద్ధి కేంద్రం ఆలస్యంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల్లో పనులు పూర్తిచేసి యూడీజీని ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.వరద ముంపు, చెరువుల కాలుష్యానికి చెక్.. ఖమ్మం నగరాన్ని వరద గండం నుంచి కాపాడటంతో పాటు, చెరువులు మురుగునీటితో కలుషితం కాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖానాపురం చెరువు నుంచి ధాంసలాపురం చెరువు వరకు మున్సిపల్ డ్రెయిన్ల ద్వారా వచ్చే మురుగునీరు వరద కాలువల్లో కలిసి చెరువులను కలుషితం చేస్తుండటంతో ధాంసలాపురం చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారంగా అన్ని డ్రెయిన్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో అనుసంధానించి మురుగునీటి శుద్ధి కేంద్రానికి తరలిస్తామని చెప్పారు. శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగించుకోగా, మిగిలిన నీరు మాత్రమే చెరువుల్లోకి చేరుతుందని వివరించారు.గత సంవత్సరాల్లో ఖానాపురం చెరువు అలుగు వరద పోటెత్తడంతో పలు డివిజన్లు ముంపునకు గురయ్యాయని గుర్తుచేసిన మంత్రి, వర్షపు నీటిని తరలించేందుకు రూ.250 కోట్లతో వరద కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు వెల్లడించారు. వాకర్స్ ఆరోగ్యం, ఆహ్లాదం కోసం రెండు లకారం చెరువుల మధ్య నాలా సుందరీకరణ పనులను త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం...ఖమ్మం నగరవాసులకు తాగునీటి కష్టాలు లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. కృష్ణా నది నీరు అందని పక్షంలో గోదావరి జలాలను నాగార్జునసాగర్ కెనాల్‌కు మళ్లించి సమస్యను పరిష్కరిస్తామని, ఇప్పటికే గోదావరి జలాలను మున్నేరు వరకు తరలించినట్లు తెలిపారు.రూ.200 కోట్లతో యూఐడీఎఫ్ పథకం నిధుల..ఖమ్మం నగరంలో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.200 కోట్లతో యూఐడీఎఫ్ పథకం కింద తాగునీటి ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని మంత్రి తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న పనుల వివరాలు ఆయన ఏకరువు పెట్టారు:25 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల తాగునీటి శుద్ధి ప్లాంటు24 కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణం100 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు23,000 కొత్త నల్లా కనెక్షన్లునగరంలోని 4 జోన్లలో 24 గంటలూ తాగునీటి సరఫరాపూర్తి ఆటోమేషన్ విధానంలో రక్షిత తాగునీటి పంపిణీఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం నగర ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా తీరనుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు... ఖమ్మం నగరాభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తాగునీటి పథకం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయడంలో సీఎం చూపిన చొరవను మంత్రి కొనియాడారు. నగర ప్రజల దాహార్తి తీర్చడంతోపాటు, వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, పబ్లిక్ హెల్త్ డీఈ నవీన్‌కుమార్, ఏఈలు నవ్యజ్యోతి, దివ్య సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి సివిల్ టెండర్లలో గోల్మాల్..?

## మొదటి పేజీ తరువాయి..

కేటాయింపులో కొందరు కాంట్రాక్టర్లు కుమ్మక్కై ముందుగానే టెండర్లను పంచుకొని, చివరకు ఒకే వ్యక్తికి టెండర్ దక్కేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారానికి కొందరు అధికారులు కూడా పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. తాజాగా రేగళ్ల కు చెందిన కాంట్రాక్టర్‌కు ఒక సివిల్ టెండర్ దక్కినట్లు సమాచారం. అయితే ఆ టెండర్‌లో అవుట్‌సోర్సింగ్ విధానంలో 16 పోస్టులకు మాత్రమే అనుమతి ఉండగా, వాస్తవానికి 21 మందికి పైగా నియామకాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కార్మిక వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### ఉద్యోగాల కోసం డబ్బుల దందా..?

ఈ నియామకాల వెనుక రుద్రంపూర్ తండాకు చెందిన ఓ కాంట్రాక్టర్ కీలకంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ అభ్యర్థుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు వసూలు చేసి పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. డబ్బులు చెల్లించిన వారికే ఉద్యోగాలు కల్పిస్తూ, అర్హులైన స్థానిక యువతను పక్కన పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్థానికులకు అన్యాయం జరుగుతోందా..?

స్థానిక యువతకు ఉపాధి కల్పించాల్సి న కాంట్రాక్టు నియామకాలు కొందరి చేతుల్లో వ్యాపారంగా మారిపోయాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో ఇలాంటి వ్యవహారాలు చోటుచేసుకోవడం సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని కార్మిక సంఘాల నేతలు, నిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై డివైఎస్సీ, ఏజీఎం ఇన్‌చార్జ్ రాజారామ్ ను వివరణ కోరగా, "ఈ విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. ఎలాంటి అవకతవకలు జరిగినా సహించం. కాంట్రాక్ట్ కార్మికుల నియామకాల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటాం. స్థానికులకు న్యాయం జరిగేలా చూస్తాం" అని తెలిపారు.

# మంత్రి తుమ్మలకు మచ్చ రాబోతోందా...?

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 27**

తెలంగాణా రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ముద్దు బిడ్డ,రైతు బాంధవుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటే తెలియని వారుండరు.తుమ్మల అనే పేరు వినగానే రైతుల్లో ఒక వైబ్రేషన్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ ప్రభుత్వం దగ్గర నుండి ఈనాటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరకు మంత్రిగా పనిచేసిన వారు రైతుల కోసం,రైతుల సాగునీరు కోసం నిత్యం పాటుబడే వ్యక్తిత్వం ఆయన సొంతం.గత ప్రభుత్వం లో భారీ నీటి పారుదల శాఖా మంత్రిగా రైతులకు విశిష్ట సేవలందించి ఈ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు.ఉమ్మడి కమ్మ జిల్లాలో ఒక సంవత్సర కాలంలోనే భక్త రామదాసు ప్రాజెక్టు నిర్మించి రైతుల కలలను సాకారం చేసి,తను మానస పుత్రిక గా భావించిన సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పలు జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించటానికి పర్యటనలు చేస్తూ,అధికారులతో రివ్యూ మీటింగ్ లు ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను ప్రభుత్వానికి పంపుతూ ఎల్ నినో తో రైతులు అల్లాడుతున్న పరిస్థితుల్లో వారి భూములకు సాగునీళ్లు ఇవ్వటానికి అవిశ్రాంతంగా శ్రమిస్తున్న వారిపై కొంతమంది పరిధిదాటి ప్రవర్తిస్తున్న తీరు వల్ల మచ్చ పడనుందా,రైతు భాందవుడిగా పేరొందిన వారి ప్రతిష్ఠకు భంగం వాటిల్లనుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.మానస పుత్రిక పై మచ్చ పడనుందా..?మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మానస పుత్రిక గా భావించిన సీతారామ ప్రాజెక్టు శంకుస్థాపన దగ్గరనుండి ఈ రోజు రైతుల భూములకు సాగునీరందిచే వరకు అన్నీ తానై కంటి రెప్పల మాటున ఉన్న కనుపాప లాగా కాపాడుతూ నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఆదిలోనే నేడు విధ్వంసానికి గురవుతుంది.ఇసుక మాఫియా చేతుల్లో చిక్కి విలవిలలాడుతోంది.ఇరిగేషన్ ప్రాజెక్టు కెనాల్ కరకట్టలు భారీ యంత్రాల,వాహనాల తాకిడితో ధ్వంసమవుతున్నాయి. అనామతు పత్రాలతో,తాత్కాలికమైన అనుమతులతో మొదలుపెట్టిన ఈ ఇసుక రవాణా నేడు ఈ ప్రాంతంలో ఒక మాఫియా ను సృష్టించి కెనాల్ కు ఇరుప్రక్కలా పకడ్బందీగా నిర్మించిన కరకట్టలు నేడు గ్రామాలలో సందు రోడ్లను తలపిస్తున్నాయి.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంతో జాగ్రత్తతో ఎప్పటికప్పుడు నిత్యం అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ నాణ్యత రాజీ లేకుండా నిర్మించిన ఈ నిర్మాణాల విధ్వంసానికి కారకులెవరు,అనుమతులు ఇచ్చిన అధికారులెవ్వరు అనేది రైతుల మదిలో మెదిలే సమాధానం లేని ప్రశ్నలు. కెనాల్ ను పూడ్చుతున్నా నోరు మెదపరెందుకు...?ఇసుక సీనరేజ్ దక్కించుకున్న రైజింగ్ కాంట్రాక్టర్ కు వేల కోట్ల రూపాయల వ్యయం తో,ప్రజాధనం తో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు కెనాల్ ను పూడ్చే అధికారం ఎవరిచ్చారు.కాలువ కరకట్ట లు ధ్వంసమై భారీ లోడు తో వెళుతున్న లారీలు టైర్లు మునిగే దాకా దిగబడుతుంటే రైజింగ్ కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా ఈ శిల్ట్ ను మొత్తం జేసీబీ ల సహాయంతో ,భారీ యంత్రాల సహాయంతో కెనాల్ లోకి నెట్టి పూడ్చి వేసే అధికారం ఎవరిచ్చారని స్థానిక రైతాంగం మండి పడుతున్నారు. మమ్ముల్ని మభ్య పెట్టి,మాయ చేసి ఇసుక రవాణా చేస్తూ,మా భూముల త్యాగంతో రైతుల కోసం నిర్మించిన కాలువలను ఏ ఉద్దేశంతో పూడ్చుతున్నారని,ఇదంతా కళ్ళెదుట జరుగుతుంటే అధికారులు మోనం గా ఉండటంలో ఆంతర్యమేమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ప్రాజెక్టు జీరో పాయింట్ వద్దకు వెళ్లగలరా...? సీతారామ ప్రాజెక్టు నిర్మాణం లో భాగంగా అధికారులు నిత్యం పర్యవేక్షించటానికి నిర్మించిన ఇన్స్ పెక్షన్ రోడ్లపై వారు తమ కార్యనిర్వాహక కార్యాలయాల నుండి ప్రాజెక్టు జీరో పాయింట్ వద్దకు చేరుకోలేని చందంగా నేడు ఆ రోడ్లు ధ్వంస మయినాయి.అధికారులు కెనాల్ సరిగా ఉందో లేదో చూడటానికి,నీటి పారుదల తీరును పరిశీలించడానికి,ఏదైనా అత్యవసర మరమత్తులు ఏర్పడితే తక్షణమే మరమ్మతులు చేయటానికి యంత్రాలు త్వరగా వెళ్లటానికి ఈ రహదారులను నిర్మించారు.కానీ నేడు మరమ్మతులు చేయటానికి యంత్రాలు కాదుకదా కనీసం టూ వీలర్ మీద కూడా అక్కడికి వెళ్ళలేరు.ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టు కెనాల్ ద్వారా గోదావరి జలాలు తరలిస్తున్న నేపథ్యంలో ఏదైనా అత్యవసర సమస్య ఏర్పడితే మరమత్తులు చేయలేని పక్షంలో పెను ప్రమాదం పొంచి ఉంది.ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఇన్స్ పెక్షన్ రోడ్లను,కరకట్టను ధ్వంసం చేసిన వారిపై,ప్రాజెక్టు కెనాల్ ను పూడ్చే వారిపై చర్యలు తీసుకోవాలని,ఇటువంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## కామేపల్లి మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గా ఎన్నికైన ఇట్ట శ్రీనివాస్ ను అభినందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**కామేపల్లి, జూలై 27 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గా ఎన్నికైన కొత్త లింగాల స ర్పంచ్ ఇట్ట శ్రీనివాస్ ను సోమవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం



కనకయ్య అభినందించారు.శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి ఆశీస్సు లు తీసుకున్నా రు.ఎమ్మెల్యే ఆయనకు శాలువా కప్పి,మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.సర్పంచ్ ల సంఘ అభివృద్ధికి, పంచాయితీల అభ్యున్నతికి, ప్రజా సమ స్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించా రు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొనకంచి నాగేశ్వరరావు, నల్లమోతు వెంకట నరసయ్య,తోటకూరి శ్రీనివాసరావు, హెచ్చు బ్రహ్మం, బొందల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## తుంబూరు దయాకర్ రెడ్డిని కలిసిన ఇట్ట శ్రీనివాస్

**కామేపల్లి, జూలై 27 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన ఇట్ట శ్రీనివాస్ సో మవారం తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయా కర్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సు లు తీసుకున్నారు.ఈ సందర్భంగా



దయాకర్ రెడ్డి శ్రీనివాస్ కు శాలువా కప్పి అభినందించారు.మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గింజల న రసింహారెడ్డి,మాజీ ఎంపీటీసీలు రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్యనారాయణ, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోత్ బావ్ సింగ్, తాళ్లగూడెం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లమోతు వెంకట నరసయ్య,కొత్త లింగాల కాంగ్రెస్ నాయకులు తోటకూరి శ్రీనివాసరావు, కొనకంచి నాగేశ్వరరావు, ఉండాడి రాములు,హెచ్చు బ్రహ్మం,బొందల వెంకటేశ్వ ర్లు తదితరులు పాల్గొన్నారు.

## కామేపల్లి రైతు వేదికలో విత్తన మేళా రైతులకు వర్షాభావ పరిస్థితులపై అవగాహన

**ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి ఏవో బి.తారా దేవి**

**కామేపల్లి, జూలై 27 ప్రభాతవార్త:**

కామేపల్లి రైతు వేదికలో సోమవారం విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి, సర్పంచ్ అజ్మీర బుల్లి, ఎంపీడీవో ధరావత్ సోమలాల్, ఎంపీఓ వి వి ఎస్ శాస్త్రి పాల్గొని రైతులకు వర్షాభావ పరిస్థితులను వివరించారు.ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు.ఆరుతడి పంటలు అధిక దిగుబడులకు సోపా నాలు అన్నారు.52 కిలోల పెసర విత్తనాలు రకము ఎం జి జి 385, 52 కిలోల మి నప విత్తనాలు పియూ 31 రకం, నువ్వులు ,ఆముదం విత్తనాలు రైతులకు కొ నుగోలు కోసం అందుబాటులో ఉన్నాయ ని తెలిపారు.ఈ సదవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.మంగళవారం రైతు వేదికలో నిర్వహించనున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ 100 ఎపిసోడ్ కు హాజరై రైతు నేస్తం, విత్తన మేళా కార్యక్రమాలను హాజరై విజయవంతం చేయాలని ఏవో తారా దేవి కోరారు.ఈ విత్తన మేళా కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే.శ్రీకాంత్,రైతులు జరుపల ఊద్య,అజ్మీర రమేష్, బోడ మంగ్య తదితరులు పాల్గొన్నారు.




## ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించండి

**పంట కాలువలు, ప్రత్యామ్నాయ పంటసాగుపై అవగాహన అలవర్చుకోవాలి**

**ముచ్చర్ల సర్పంచ్ లూసీ పిలుపు**

**కామేపల్లి,జూలై 27 ప్రభాతవార్త:**

ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించు కొని సంపూర్ణ పారిశుద్ధ్యనికి తోడ్పడాలని కామేపల్లి మండలం ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ



కోరారు.సోమవా రం స్థానిక పంచాయతీ కార్యాలయంలోఇంకుడు గుంతలు, పంట కాలువల నిర్మాణం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యా మ్నాయ పంటల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.ఇండ్లల్లో వాడుకున్న నీరు ఇంకి పోవడానికి ఇంకుడు గుంతలు,రోడ్ ప్రక్కనగల కాలువలకు ఇంకుడు గుంత, పంట చేల్లో ఇంకుడు గుంత, బోరు బావు ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణం ఎంతో అవసరం అన్నారు.ప్రస్తుతం వర్షాబా పరి స్థితులు నెలకొన్నందున ఆరుతడి పంట లను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.అనురాధ, ఉపసర్పంచ్, ఏఈఓ దీపక్ రెడ్డి ,వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ లు,రైతులు, యువకులు, మహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షోభం ఉన్న అభివృద్ధి కార్యక్రమాల్లో తెలంగాణ అగ్రగామి

**త్వరలో నిమ్స్ ఆస్పత్రిలో కూడా ఉచిత వైద్యం**

**ప్రజల కోసం పాటుపడుతున్న ప్రభుత్వానికి మద్దతు పలకండి**

**ఎమ్మెల్యే మట్ట రాగమై దయానంద్ విజ్ఞప్తి**

**తల్లాడ జులై 27: ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో పేద ప్రజలకు అందాల్సి న సంక్షేమ పథకాలను మాత్రం అమలు చేయడంలో అగ్రభాగాన ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమై దయానంద్ అన్నారు సోమవారం తల్లాడ రైతు వేదికలో తాసిల్దార్ తిరుమలగిరి కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన కళ్యాణ లక్ష్మి శ్రీ షాది ముబారక్ చెక్కుల పంపిణీ అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మూడు నాలుగు నెలల్లోనే కల్యాణ లక్ష్మి శ్రీ చెక్కులు లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తద్వారా ఆడపిల్ల ఉన్న కుటుంబాలకు కొంత మేరకు ఉపశమనం కలుగుతుందన్నారు సీఎం రిలీఫ్ ఫండ్ కళ్యాణ్ లక్ష్మి శ్రీ లాంటి పథకాలకు రాజకీయాలతో సంబంధం లేకుండా అందరికీ మంజూరు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు అలాగే త్వరలో నిమ్స్ ఆసుపత్రిలో కూడా ఉచితంగా వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందని నాలుగైదు లక్షల వరకు అత్యవసరమైతే ఎల్ఓసి ల ద్వారానే చికిత్స అందించడం జరుగుతుందని గుర్తు చేశారు గత పది సంవత్సరాల్లో ఒక రేషన్ కార్డు మంజూరు జరగలేదని ఈ రెండున్నర సంవత్సరాలలో రేషన్ కార్డు లు పంపిణీ ద్వారా సన్న బియ్యం ఆధార్ కార్డు ఉన్న మహిళకు ఉచిత బస్సు ఆధార్ కార్డు ఉంటే ఉచిత బస్సు ప్రయాణం లాంటివి చేపడుతున్న ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని తద్వారా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమా లు చేపట్టడానికి మీ సహకారం అవసరమని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజు తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు కటికి కిరణ్ కుమార్ ఆర్ ఐ వాసిం అహ్మద్ మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మీరెడ్డి దిరిశాల నరసింహారావు జక్కంపూడి కిషోర్ తుమ్మలపల్లి రమేష్ రాయల రాము వేమిరెడ్డి కృష్ణారెడ్డి పొట్టేటి జనార్దన్ రెడ్డి వేమిరెడ్డి కృష్ణారెడ్డి గోవింద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు






## ఏపీ నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత, సీజ్

**నలుగురు పై కేసు నమోదు చేసిన పోలీసులు**

**నేలకొండపల్లి, జూలై 27 ప్రభాతవార్త;**

ఏపీ నుంచి తెలంగాణకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు ను నేలకొండపల్లి పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ నుంచి తెలంగాణ లోని సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణంకు వయా నేలకొండపల్లి మీదుగా ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను సోమవారం చెరువుమాధారం క్రాస్ రోడ్డు వద్ద పోలీసుల తనిఖీలలో పట్టుబడ్డాయి. రెండు ఇసుక టిప్పర్లు ను పోలీసులు సీజ్ చేయటంతో పాటు, టిప్పర్ల ఓనర్లు, డ్రైవర్ లు మొత్తం నలుగురు పై కేసు నమోదు చేశారు.

## కాకరవాయి గ్రామంలో చోరీబంగారు గొలుసు , వెండి పట్టీలు దోచుకెళ్లిన గుర్తుతెలియని దొంగలు

**వరుస దొంగతనాలతో హడలెత్తిపోతున్న మండల ప్రజలు**

**చోరీలపై విచారణ చేపట్టిన పోలీసులు.**

**తిరుమలాయపాలెం ప్రభాతవార్త న్యూస్ జూలై 27**

తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో గుర్తుతెలియని దుండగులు ఓ ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు వెండి పట్టీలు దొంగిలించుకుని వెళ్ళినారు. వివరాల్లోకి వెళితే కాకరవాయి గ్రామానికి చెందిన బోరుకొమ్ముల సతీష్ తండ్రి కృష్ణయ్య గత ఐదు నెలల నుండి బ్రతుకుతెరువు కొరకు హైదరాబాద్ పట్టణంలో వాచ్మెన్ గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం వడ్లు అమ్మిన డబ్బులు అప్పుడప్పుడు అదే గ్రామానికి చెందిన వారికి కొద్ది మొత్తంలో వడ్డీలకు ఇస్తూ వచ్చిన డబ్బులు ఒక లక్ష రూపాయలు , రెండున్నర తులాల బంగారు గొలుసు వెండి పట్టీలు సుమారు పది తులాలు ఇంట్లో బీరువాలో పెట్టి తాళం వేసుకొని హైదరాబాద్ కి వెళ్లారు . కొద్దిరోజుల క్రితం అతని భార్య సర్ ఫారమ్స్ నింపి బిఎల్ఓ కి ఇచ్చి 15 రోజుల క్రితమే వెళ్లానన్నారు. మరి కొద్ది రోజుల తర్వాత ఈ మధ్యనే బంధువులు ఒకరు కాకరవాయి గ్రామంలో చనిపోగా వారిని మందలించుట కొరకు ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో కాకరవాయి గ్రామానికి వచ్చి వారితో ముచ్చటించి 9 గంటల ప్రాంతమున అతని తల్లి తండ్రి నివసిస్తున్న ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు సోమవారం ఉదయం ఏడు గంటలకు లేచి తన సొంత ఇంటికి పోయి చూడగా తాళాలు తీసి ఉన్నాయని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని అందులో చూస్తే డబ్బులు , బంగారం లేదని చూచి దొంగలు పడ్డారని మా బంగారు గొలుసులు , వెండి పట్టీలు, డబ్బులు దొంగిలించుక వెళ్లారని ఆ గ్రామ పెద్దలకు చూపించి పోలీసు వారికి విషయం తెలుపగా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై జగదీష్ వెంటనే సంఘటన జరిగిన స్థలానికి వారి సిబ్బందితో వెళ్లి చూచి క్లూస్ టీమ్ వారిని పిలిపించి దొంగతనం జరిగిన విధానాన్ని గమనించి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని దుండగులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. ఈ సందర్భంగా ఎస్ఐ జగదీష్ ప్రజలతో మాట్లాడుతూ త్వరలోనే దుండగులను పట్టుకొని తీరుతామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు దొంగతనాలు జరుగుతున్న విషయాలను గమనించుకొని ధైర్యంగా ఉండాలని గుర్తుతెలియని కొత్త వ్యక్తులు కనిపిస్తే అనుమానితులు ఎవరైనా ఉంటే మాకు తెలియపరచాలని అదేవిధంగా అప్రమత్తంగా ఉండాలని , బంగారు నగలు , డబ్బులను భద్రపరుచుకోవాలని ప్రజలకు తెలియజేశారు.






## వాడపల్లి వెంకన్న దర్శనానికి ప్రత్యేక బస్సులు

**ప్రతి శుక్రవారం భద్రాచలం నుంచి ప్రత్యేక డీలక్స్ సర్వీస్**

భద్రాచలం, జూలై 27 (ప్రభాతవార్త):



కోనసీమ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి వెంకన్న స్వామి దర్శనానికి భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ భద్రాచలం డిపో ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జంగయ్య తెలిపారు.ప్రతి శుక్రవారం రాత్రి 10 గంటలకు భద్రాచలం బస్‌స్టాండ్ నుంచి సర్వీస్ నంబర్ 98711తో ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని తెలిపారు. వెళ్లి వచ్చే టికెట్ ధర రూ.1,000 మాత్రమే అని పేర్కొన్నారు.భద్రాచలం పట్టణంతో పాటు చర్ల, దుమ్ముగూడెం, ఎటపాక, బూర్గంపాడు, కుక్కునూరు, వేలేర్పాడు, అశ్వారావుపేట మండలాల భక్తులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.అలాగే, ఒక గ్రామం నుంచి 40 మంది భక్తులు ఉంటే వారి ప్రాంతానికే బస్సు పంపే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల అభ్యర్థన మేరకు ఏడు వారాల పాటు ప్రత్యేక బస్సు సర్వీసులు కొనసాగుతాయని చెప్పారు.మరిన్ని వివరాలకు టీజీఎస్ఆర్టీసీ భద్రాచలం స్టేషన్ మేనేజర్‌ను సంప్రదించవచ్చని లేదా 9553990399 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందాలని డిపో మేనేజర్ జంగయ్య సూచించారు

## పోకల దమ్మక్క యాత్రకు పీవోకు ఆహ్వానం

**శాస్త్రోక్తంగా ఉత్సవాలు నిర్వహించాలని ఐటిడిఏ పీవో సూచనలు**

భద్రాచలం కల్చరల్, జూలై 27:



అపర శబరి పోకల దమ్మక్క సేవా యాత్రలో పాల్గొనాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు సోమవారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి దామోదర్ రావు ఆదేశాల మేరకు ఏఈఓ, అర్చక స్వాములు పీవో చాంబర్‌లో బి. రాహుల్‌ను కలిసి మంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలు, ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా పీవో బి. రాహుల్ మాట్లాడుతూ, శ్రీ సీతారామచంద్రస్వామి అనుగ్రహానికి పాత్రురాలైన పోకల దమ్మక్క సేవా యాత్ర గిరిజనుల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. వివిధ గిరిజన గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే నేపథ్యంలో సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా ఉత్సవాలను నిర్వహించాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఆలయ ఆచారాలు, పూజా విధానాలు, ఉత్సవ కార్యక్రమాలు పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా కొనసాగాలని, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. దర్శనం, తాగునీరు, వైద్య సేవలు, శాంతిభద్రతలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ భవానీ రామకృష్ణ, పర్యవేక్షకుడు శ్రీనివాసరెడ్డి, అర్చక స్వాములు విష్ణు, ఎస్.వి. మదనమోహన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు

## భూ నిర్వాసితులకు 20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి

**దుమ్ముగూడెం ప్రభాతవార్త :**సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న భూ నిర్వాసిత రైతాంగానికి ఎకరానికి 20 లక్షలు చెల్లించాలని చర్ల దుమ్ముగూడెం మండలాల సీతమ్మసాగర్ భూ నిర్వాసిత రైతాంగ అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు దుమ్ముగూడెం మండలం లోని ఎల్ ఎన్ రావు పేట పెద్ద బండ్రేవు భూనిర్వాసిత రైతాంగంతో కలిసి భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఒక వినతి పత్రాన్ని సమర్పించారు ప్రాజెక్టు కింద నష్టపోతున్న ప్రతి గ్రామానికి ఒకే రేటును కేటాయించి రైతాంగానికి ఇవ్వాలని ఒక వద్ద ఒక రేటు మరో వద్ద ఇంకొక రేటు కాకుండా కనీసం ఎకరానికి 20 లక్షల రూపాయలు చెల్లించాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు ఫేస్ వన్ లో నష్టపరిహారం కింద తక్కువ పరిహారాన్ని రైతాంగానికి ప్రభుత్వం చెల్లించిందని రైతాంగానికి జీవనాధారమైన భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టపరిహారాన్ని పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు

# గిరిజన దర్బార్‌లో ఉద్యోగ దరఖాస్తులకు నో

**స్వయం ఉపాధి దరఖాస్తులకే ప్రాధాన్యం: ఐటిడిఏ పీఓ బి. రాహుల్**

భద్రాచలం, జూలై 27 (ప్రభాతవార్త):

గిరిజన దర్బార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరించబోమని, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకునే పథకాలకు సంబంధించిన వినతులను మాత్రమే స్వీకరిస్తామని భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్పష్టం చేశారు.సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడీఎంహెచ్‌వో సైదులు తదితర అధికారులతో కలిసి గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. అందిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖలకు



పంపిస్తూ, అర్హులైన ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.దర్బార్‌లో అధికంగా పోడు భూముల పట్టాలు, పేర్ల మార్పులు, రైతుబంధు, మీసేవ కేంద్రాల ఏర్పాటు, కిరాణా, ఫ్యాన్సీ స్టోర్లకు రుణాలు, విద్యుత్, బోర్లు, మోటార్లు, సోలార్ విద్యుత్, చేపల సంఘాల ఏర్పాటు, ఉన్నత విద్య, దీర్ఘకాలిక వ్యాధుల వైద్యం, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం తదితర అంశాలపై దరఖాస్తులు అందినట్లు తెలిపారు.గిరిజనులు సమర్పించిన ప్రతి అర్జీని ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేసి, అర్హత మేరకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి వారి జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని పీఓ రాహుల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ వేణు, పీవీటీజీ అధికారి గన్యా నాయక్, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, హౌసింగ్ ఏఈ హేమంత్, మేనేజర్ ఆదినారాయణ, సున్నం రాంబాబు, నరేందర్, లింగా నాయక్, ప్రమీల బాయి, విజయ్, నాగేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు

## డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు కేటాయించండి

**కలెక్టర్ అంకిత్ కు వినతి**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:



బూర్గంపహాడ్ మండల పరిధిలోని టేకులచెరువు గ్రామానికి చెందిన 40 కుటుంబాలకు డబుల్ బెడ్ రూములు గత ఐదు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉండటం వల్ల సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అంకిత్ కు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ అధికారం లోఉన్నప్పుడు నిర్మాణం జరిగిందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టేకులచెరువు గ్రామానికి చెందిన 40 కుటుంబాలకి అధికారికంగా ప్రకటించి ఇంత మట్టికి ఇవ్వకపోవడం వల్ల కలెక్టర్ దృష్టికి తీసుకురావటం జరిగింది వెంటనే కలెక్టర్ స్పందించి హౌసింగ్ బోర్డు అధికారులకు నెల రోజులలో డబుల్ బెడ్ రూములు నిర్మాణాన్ని పూర్తి చేసి 40 కుటుంబాలకి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు .నెల రోజుల్లో ఇవ్వలేకపోతే అధికారికంగా ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వారికి కేటాయించాల్సిన అవసరం ఉందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పాండవుల రామనాథం, శాఖ కార్యదర్శి బోల్ల శ్రీశైలం, ఎంఎల్ పార్టీ నాయకుడు జక్కుల రాంబాబు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్రాలబైలులో భూ భారత్-భూ సర్వేపై అవగాహన సదస్సు

**దుమ్ముగూడెం ప్రభాతవార్త :** దుమ్ముగూడెం మండలం నారాయణ రావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని గుర్రాలబైలు గ్రామంలో సోమవారం భూ భారత్–భూ సర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దుమ్ముగూడెం తహసిల్దార్ఎం. అశోక్ కుమార్ హాజరై మాట్లాడారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం సాగులో ఉన్న భూముల సరిహద్దులను క్షేత్రస్థాయిలో గుర్తించి, అర్హులైన రైతులందరికీ భూ ఆధార్ పట్టాలు అందజేస్తామని తెలిపారు భూ వివాదాల పరిష్కారానికి, భూ రికార్డుల పారదర్శకతకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతులందరూ భూ సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ భూముల వివరాలను సరిచూసుకొని అధికారులకు సహకరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహారావు, జీపీఓ గోపరాజు సర్వేయర్లు ఉప సర్పంచ్ నూప రాధ వార్డు సభ్యులు కల్లూరి ముగ్గరాజు కొమరం భద్రయ్య సీతారామయ్య జంపన్న ఉబ్బ నాగమణి, కూరం సీతమ్మ, కల్లూరి కృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు



## కరివేద పంటపై అవగాహన

దుమ్ముగూడెం ప్రభాతవార్త :



లచ్చిగూడెం రైతువేదికలో మైరాడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కరివెద గురుంచి రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమం లో నాటు పద్ధతి కాకుండా ఆధునిక పద్ధతి అవాలభించాలనీ డ్రమ్ సీడర్ సీడ్ డ్రిల్లర్ ఉపయోగించి వ్యవసాయం చేయాలని రైతులకు అవగాహన కల్పించారు ఈ యొక్క కార్యక్రమం ఉద్యశించి మైరాడా ఆగ్రోమినెస్ట్ అధికారి షణ్ముఖ్ సాయి మాట్లాడుతూ డ్రమ్ సిడర్ వలన కూలి ఖర్చు ఎకరానికి 5000 నుండి 6000 వరకు తగ్గుతుందిని మరియు విత్తనాలన ఖర్చు ఎకారానికి 8 నుండి 10 కేజీలు విత్తనాలు పడతాయి అని వివరిచడం జరిగింది సీడ్ డ్రిల్లర్ వలన కూలి ఖర్చు విత్తనాలు ఖర్చుతో పాటు దమ్ము ఖర్చు కూడా తగ్గుతుంది అని ్ర తెలిపారు ఐటీసీ యంఎస్కె మరియు మైరాడ వారి ఆర్థిక సహకారుముతో ఇచ్చిన ఆగ్రీ ఇన్పుట్స్ ఉపయోగంచి రైతులు అభివృద్ధి పొందాలనేదే ఈ కార్యక్రమం యెక్క ముఖ్య ఉదేశ్యం ఈ కార్యక్రమంలో నారాయణ రావు పేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ గారు ఏ ఈ ఓ జ్యోతి మైరాడ ప్రతివిది షణ్ముఖ సాయి మైరాడ సి ఓ .రాజు శాంతి రమేష్ నారాయణరావు పేట పౌలూరిపేట లచ్చిగూడెం రైతులు పాల్గోనడం జరిగింది.

## రైతు వేదికలో విత్తన మేళా రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఏడీఏ తాతారావు**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు సూచించారు.బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో చిరుధాన్యాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చిరుధాన్యాల సాగు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.నేడు, రేపు రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంటాయని, ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన విత్తనాలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్, ఏఈవోలు శృతి, పవన్, రైతులు గాదె నర్సిరెడ్డి, పలువురు రైతులు, అశ్వరావుపేట కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సుజాతనగర్ మండల సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి

**ప్రజా అవసరాలకు అనుగుణంగా**

**మౌలిక వసతుల కల్పిస్తున్నాం**

**రూ.1.95కోట్ల అభివృద్ధి**

**పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**



సుజాతనగర్, జూలై 27 ప్రభాతవార్త: కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుజాతనగర్ కార్పొరేషన్ ప్రాంతంగా మారిన తర్వాత మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సుజాతనగర్ నుండి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు అందుబాటులోకి తెచ్చామన్నారు. సుజాతనగర్‌లో మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుతో పాటు, సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధి కోసం రూ.5.5 కోట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రం మంజూరైందని, అదేవిధంగా నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రగతికి అవసరమైన నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండె హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఏఈ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు తాళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు మండల నాయకులు వీర్ల మల్లేష్, దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం .. ప్రభుత్వ విద్యార్థులకు ఘన సన్మానం

ములకలపల్లి, జూలై 27 ప్రభాతవార్త :



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని వైరా పట్టణ ఎస్సై పుష్పాల రామారావు పిలుపునిచ్చారు. సోమవారం స్వర్గీయ పుష్పాల జగన్నాథం- ఇందిరమ్మ స్మారకార్థం మండలంలోని జగన్నాథపురం, పూసుగూడెం, పొగళ్లపల్లి, ములకలపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు పుష్పాలజగన్నాథం- ఇందిరమ్మ స్మారక ప్రతిభా పురస్కారాలు పేరిట నగదు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైరా ఎస్ఐ పుష్పాల రామారావు మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామని తెలిపారు. తమ తల్లిదండ్రుల స్మారకార్థం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నగదు పురస్కారాలతో ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ప్రోత్సాహం విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతో పాటు మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ, విద్యారంగంలో ప్రతిభను ప్రోత్సహించే ఆదర్శ కార్యక్రమంగా నిలుస్తుందన్నారు . మండల విద్యాధికారి జి.సత్యనారాయణ పుష్పాల కుటుంబ సభ్యులు పుష్పాల వెంకన్న, చందర్‌రావు, సందుకూరి లక్ష్మి, పుష్పాల సాయి, మండల ప్రముఖులు బండి కొమరయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కు ఉపాధ్యాయుల ముందడుగు

**ప్లాస్టిక్‌కు స్వస్తి..**

**సొంత పాత్రలతో భోజనం**

**చేసి ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయులు**



ములకలపల్లి, జూలై 27 (ప్రభాతవార్త): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను గుర్తించి ముందుకు రావాలనే సందేశాన్ని ములకలపల్లి మండల ఉపాధ్యాయులు ఆచరణ ద్వారా చాటిచెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్జీటీ (శిటిగి) ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం ప్లాస్టిక్ రహితంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఉపాధ్యాయుడు కే. శ్రీరామ్ చొరవతో శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరూ ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులను పూర్తిగా విరమించి, తమ ఇళ్ల నుంచే సొంత ప్లేట్లు, గ్లాసులు తీసుకువచ్చి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ వినూత్న కార్యక్రమంతో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణతో పాటు పర్యావరణ పరిరక్షణపై తమ నిబద్ధతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్, మండల విద్యాధికారి (ఎంఈఓ) సత్యనారాయణ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతిని కాపాడే ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమాజానికి మార్గదర్శకులైన ఉపాధ్యాయులు స్వయంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం విద్యార్థులు, యువత, ప్రజల్లో పర్యావరణంపై మరింత అవగాహన పెంపొందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయుల ఈ వినూత్న చర్యను పలువురు అభినందించారు. చిన్న చిన్న అలవాట్లలో మార్పు తీసుకొస్తేనే పెద్ద స్థాయిలో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందనే సందేశాన్ని ఈ కార్యక్రమం బలంగా చాటిందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా అమలైతే ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి మరింత ఊతమిస్తాయని పేర్కొన్నారు.

## ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి సంపత్ కుమార్

కొత్తగూడెం టౌన్, జూలై 27 ప్రభాతవార్త:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్ నందు ఎస్సీ సెల్ జిల్లా,పట్టణ మరియు మండల కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మానకొండూరు శాసనసభ సభ్యులు కవంపల్లి సత్యనారాయణ, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్నతో కలిసి నియామక పత్రాలు ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, జిల్లా కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ వై. శ్రీనివాస్ రెడ్డి, కొత్వాలా శ్రీను, కార్పొరేటర్స్ జెల్లి శ్రీలక్ష్మి, సుప్రియ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ కే సాధ్యం

**డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రమాణ స్వీకారం లో పాల్గొన్న కొత్వాల**

పాల్వంచ టౌన్, జూలై 27 ప్రభాతవార్త: పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కాంగ్రెస్ కే సాధ్యమని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం కొత్తగూడెంలో నిర్వహించారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్ లో జరిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్వాల మాట్లాడుతూ నాటి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ల నుండి నేటి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు చేపడుతున్నదని కొత్వాల అన్నారు. నూతనంగా నియామకమైన జిల్లా ఎస్సీ కమిటీని అభినందించారు.



## అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాముల పంపిణీ

**చిన్నారులకు స్వయంగా టిఫిన్ తినిపించిన**

**కార్పొరేటర్ భీమా శ్రీవల్లి శ్రీధర్**

కొత్తగూడెం టౌన్, జూలై 27 ప్రభాతవార్త:



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ కూలీలైన్ 12వ అంగన్వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూనిఫాం పంపిణీ, టిఫిన్, పోషకాహార భోజన పథకాలను కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో సరదాగా మాట్లాడుకుంటూ వారికి స్వయంగా టిఫిన్ తినిపించి, వారి ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, చదువుపై ఆసక్తి గురించి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న నూతన యూనిఫాములను చిన్నారులకు పంపిణీ చేశారు. యూనిఫాములు అందుకున్న చిన్నారులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు ప్రభుత్వానికి, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులతో ప్రత్యేకంగా మాట్లాడిన కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న టిఫిన్, పోషకాహారం, గుడ్లు, ఇతర సంక్షేమ సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు, లోపాలు లేదా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తన



దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, ప్రతి రోజు కేంద్రానికి వచ్చే పిల్లలకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలు, ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. వారి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినా, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుందరీకరణతో మారనున్న పట్టణ ముఖచిత్రం

**ప్రజలకు మేలైన వసతులు అందుబాటులోకి తెస్తున్నాం**

**సెంట్రల్ లైటింగ్, టూవే లైన్ రోడ్డులో ప్రారంభించిన ఎమ్మెల్యే**

కొత్తగూడెం కార్పొరేషన్, జూలై 27 ప్రభాతవార్త:

పట్టణ పరిధిలో రూ.2 కోట్ల డిఎంఎఫ్ నిధులతో నిర్మించిన భజన మందిర్ రోడ్డు సుందరీకరణ పనులతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ డివైడర్, టూ వే రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి వీధి దీపాలను వెలిగించిన అనంతరం ఏర్పాటు చేసిన



ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రోడ్డు విస్తరణ పనుల వల్ల రాకపోకలకు ఎదురవుతున్న తీవ్ర అంతరాయం తొలగిపోతుందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ఈ లైటింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి గోదుమవాగు వరకు సెంట్రల్ డివైడర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ నాణ్యతా ప్రమాణాలతో బూడిదగడ్డ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులను మోడల్ రహదారులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనలో స్థానిక సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. మంజూరైన ప్రతి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజల వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు, నాయకులు, వాసిరెడ్డి మురళి బోయిన విజయ్ కుమార్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, యూసఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బండి నరసింహ, కొచ్చర్ల రాకేష్, సాత్విక్, ధనరాజ్, జహీర్, శాంతి ప్రియ, దుర్గయ్య, గడ్డం సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## 20 రోజుల చిన్నారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం

లక్ష్మీదేవిపల్లి, జూలై 27 ప్రభాతవార్త:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంఎంసి అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 20 రోజుల చిన్నారి చికిత్స కోసం ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ చేంజ్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చింది. ఈ చిన్నారికి అత్యవసర శస్త్రచికిత్స అవసరం కావడంతో, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి అండగా నిలుస్తూ ఏఎండిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మహమ్మద్ ఆదిల్ ఫౌండేషన్ తరఫున ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ... సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే అవసరమైన సందర్భాల్లో పేద, నిరుపేద కుటుంబాలకు తమ ఫౌండేషన్ ద్వారా నిరంతరం సహాయం అందిస్తామని తెలిపారు. చిన్నారి విజయవంతంగా కోలుకొని ఆరోగ్యంగా జీవించాలని ఏఎండిఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆకాంక్షించారు.

## ఘనంగా కోనేరు పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు

కొత్తగూడెం టౌన్, జూలై 27 ప్రభాతవార్త:



ప్రముఖ సామాజిక సేవకుడు కోనేరు పూర్ణచంద్రరావు జన్మదిన వేడుకలు పొన్నెకంటి సంజీవరాజు ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోనేరు పూర్ణచంద్రరావు కేక్ కట్ చేసి, హాజరైన వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 28వ డివిజన్ కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి దంపతులు, బస్తీ పెద్దలు కోనేరు పూర్ణచంద్రరావును శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పొన్నెకంటి సంజీవరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంచం నాగయ్య, అమీన్, ఖాదర్ బాబా, మేడిపల్లి వెస్లీ, వడ్డేబోయిన సురేష్, ఊటుకూరి విజయ్, ఎలమంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొని కోనేరు పూర్ణచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

## విద్యార్థుల ఉద్యమానికి ఫలితం..

**నీట్‌పై కేంద్రం వెనక్కి తగ్గింది**

**ఎమ్మెల్యే కూనంనేని**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 27 ప్రభాతవార్త:




నీట్ కుంభకోణంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి న్యాయమైన ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం చివరకు దిగివచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో నష్టపోయి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ సోమవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి ఓల్డ్ డిపో వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూనంనేని మాట్లాడుతూ, దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా విద్యార్థులు, యువజనులు సాగించిన ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని స్పందించేలా చేసిందన్నారు. నీట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ విరమణ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను వ్యతిరేకిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి

## ఏరియా వర్క్‌షాప్ టెక్నీషియన్లు టీబీజీకేఎస్‌లో చేరిక

**కండువా కప్పి ఆహ్వానించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

కొత్తగూడెం, జూలై 27 ప్రభాతవార్త:




కొత్తగూడెం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి ఏరియా వర్క్‌షాప్‌కు చెందిన పలువురు టెక్నీషియన్లు టీబీజీకేఎస్ యూనియన్‌లో చేరారు. టీబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కిరణ్, దుర్గ, పాషాలకు పార్టీ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. టెక్నీషియన్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 61 సంవత్సరాలకు పెంచడం, క్వార్టర్లలో ఏసీ సౌకర్యం కల్పించడం, కారుణ్య నియామకాలు చేపట్టడం వంటి పలు సంక్షేమ చర్యలను అమలు చేశారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం టీబీజీకేఎస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, సంయుక్త కార్యదర్శి వసికర్ల కిరణ్, సెంట్రల్ కమిటీ సభ్యులు బోరింగ్ శంకర్, ఈశ్వర్, వెంకటేష్, సూరజ్, అశోక్, రాములు, అన్వర్, వల్లల రాయలింగు, కోటేశ్వరరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ

**కార్పొరేటర్ భీమా శ్రీవల్లి-శ్రీధర్ దంపతుల సేవా కార్యక్రమం**

కొత్తగూడెం టౌన్, జూలై 27 ప్రభాతవార్త:



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్‌లో కార్పొరేటర్ భీమా శ్రీవల్లి-శ్రీధర్ దంపతులు విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ భీమా శ్రీవల్లి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు బలపడాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఆటంకం కలగకుండా తమ వంతు సహాయంగా నోటు పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు. విద్యార్థులు కార్పొరేటర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ విజయవంతం

**ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన**

**విద్యార్థుల్లో చదవడం, రాయడం నైపుణ్యాల పెంపే లక్ష్యం**

లక్ష్మీదేవిపల్లి, జూలై 27 ప్రభాతవార్త:



లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యాంతర శిక్షణ కార్యక్రమం సోమవారంతో విజయవంతంగా ముగిసిందని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కృష్ణయ్య తెలిపారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం విషయంలో వెనుకబడిన వారిని గుర్తించి, వారి సామర్థ్యాలను మెరుగుపరచేందుకు అనుసరించాల్సిన ఆధునిక బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణలో పాటించాల్సిన మెలకువలపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించినట్లు చెప్పారు. ఈ నెల 21, 22, 24 తేదీల్లో నిర్వహించిన తొలి విడత శిక్షణలో 34 మంది, 24, 25, 27 తేదీల్లో నిర్వహించిన రెండో విడతలో 35 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా, మొత్తం ఆరు రోజుల పాటు 69 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీసీలు ఆనందరావు, కృష్ణయ్య, మోహన్, బి. మోహన్ పాల్గొని శిక్షణ అందించారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, లేఖన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల విద్యాభివృద్ధికి బలమైన పునాది వేయాలని ఎంఈఓ కృష్ణయ్య సూచించారు.

## ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి వేడుక

సుజాతనగర్, జూలై 27 ప్రభాతవార్త:

మండలంలోని వేపలగడ్డలో ఉన్న అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధన రంగాల్లో దేశానికి ఎంతగానో సేవ చేశారని అందుకనే ఆయన మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పిలుస్తారని అన్నారు. కలలు కనండి వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి అని ఆయన ఇచ్చిన పిలుపు ప్రతి ఒక్కరికి మార్గదర్శకామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దయాకర్, రమేష్, శ్రీకాంత్, బాబురావు, లక్ష్మి, హెచ్‌ఒడి లు రవికిరణ్, వినోద్, మునీర్, కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, అనిల్,సురేష్ తదితరులు పాల్గొన్నారు

# ఏఐ సాంకేతికతతో ఓట్లను తొలగించేకు కుట్ర
# ఓటు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి పునాది

**ఓటు హక్కు పోతే పౌరస్వతం**
**సంక్షేమ పథకాలు ప్రశ్నార్థకమే**
**ప్రతి ఒక్కరి ఓటు హక్కును రక్షించే**
**బాధ్యత కాంగ్రెస్ సైనికులదే**
**కష్టపడే ప్రతి కార్యకర్తకు**
**గుర్తింపునిస్తాం**
**పార్టీ బి ఎల్ ఏ ల సమావేశంలో**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**





మధిర జూలై 27 ప్రభాతవార్త

దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ సాంకేతిక పరిజ్ఞానంతో ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని, ప్రతి ఒక్క ఓటును నమోదు చేయడంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు కార్యకర్తలు బాధ్యతతో పని చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. సోమవారం మధిర నియోజకవర్గ పరిధిలోని బూత్ స్థాయి ఏజెంట్ల తో మండల పరిధిలోని మాటూరు పేట గ్రామంలో సమావేశాన్ని నిర్వహించారు. నెల రోజులుగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ లు కార్యకర్తలు నిర్వహిస్తున్న బాధ్యతమైన పాత్ర అభినందనీయం ఆయన అన్నారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడమే ప్రజాస్వామ్యానికి అసలైన సూత్రమని అన్నారు. దేశవ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఓటర్ల పేర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ద్వారా గుర్తించి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని భట్టి ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ రకంగా ఓట్లను తొలగించి లబ్ధి పొందారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికే తీవ్ర ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కోల్పోతే భవిష్యత్తులో రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆఖరికి ఈ దేశ పౌరసత్వం కూడా ప్రశ్నార్థకమై డిటెన్షన్ సెంటర్లకు వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరికీ కాపాడే బాధ్యత కాంగ్రెస్ సైనికులుగా బిఎల్ఏలదేనని స్పష్టం చేశారు. సొంత వ్యాపారాలు, కుటుంబ వ్యవహారాలను పక్కనపెట్టి నెల రోజులుగా సామాజిక బాధ్యతగా పనిచేస్తున్న బిఎల్ఏలను, వారి వెనుకనుంచి ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే ప్రతీ బిఎల్ఏ కుటుంబం బాధ్యతను, వారి పిల్లల చదువు, ఉద్యోగ అవకాశాలలో సహకారాన్ని పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. మధిర నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 10 శాతంలో చనిపోయిన వారి వివరాలను తొలగించడం, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించడం వంటి పనులను బూత్‌ల వారీగా పరిశీలించి నూరు శాతం నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్న పీసీసీ ప్రతినిధులను అభినందిస్తూ, బిఎల్ఏ లు ఎటువంటి విసుగు చెందకుండా సమన్వయంతో పనిచేసి ఈ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.




## సీఎం బ్రేక్ఫాస్ట్ స్కీమ్ గొప్ప కార్యక్రమానికి వేదికైన మధిర




మధిర జూలై 25 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక విలువలతో కూడిన అల్పహారాన్ని అందించడం అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. సీఎం బ్రేక్ఫాస్ట్ స్కీం ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్లో కార్యక్రమాన్ని ప్రస్తావించిన సందర్భంలో ఈ స్కీము అమలు పై తాను కూడా అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఏ లక్ష్యం కోసం అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ఈ పథకాన్ని ప్రారంభించారో ఆ లక్ష్యం నెరవేరడంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావాలని భావి తరాలకు ఆరోగ్యకరమైన మానవ వనరులను అందించే సమాజ నిర్మాణాన్ని లో యజ్ఞం లాగా దీనిని తీసుకొని అమలు చేసేందుకు వీరు నిర్వహిస్తున్న కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు ఎల్లవేళలా కొనసాగాలని కోరుకుంటున్నట్లు అన్నారు. సభ వేదికపై ఖమ్మం జిల్లా పి ఆర్ టి యు సంఘం నాయకులతో కలిసి ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కట్టా శేఖర్రావు ఆర్ రంగారావు ఆర్.బ్రహ్మారెడ్డి, రత్నకుమార్ లింగం సతీష్ రవికుమార్ కొమ్ము శ్రీనివాసరావు, రాష్ట్ర బాధ్యులు డి వెంకటేశ్వరరావు, గుత్త శ్రీనివాసరావు, కాంతారావు చిలుకూరి సత్యనారాయణరెడ్డి మధిర మండల బాధ్యులు పిల్లి నరసింహారావు లింగంపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## 29 వరకు మధిర రైతు వేదికలో విత్తనమేళా ప్రారంభించిన కలెక్టర్



మధిర జూలై 27 ప్రభాతవా ర్త

మధిర రైతు వేదికలో ఏర్పాటుచేసిన విత్తనమేళా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్‌నీనో పరిస్థితుల్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తక్కువ నీటితో సాగయ్యే పెసర మినుము కంది బొబ్బర్లు నువ్వులు జొన్నలు మరియు కూరగాయల పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రైతులందరికీ ప్రస్తుత పరిస్థితుల్లో వేసుకోవాల్సిన విత్తనాలను ప్రభుత్వం తరఫున రైతు వేదికల్లో అందుబాటులో ఉంచిందని తెలిపారు. రైతులందరూ ఈనెల 29 వరకు మూడు రోజులు రైతు వేదికలో నిర్వహించే ఈ విత్తనమేళానీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర ఏ డి ఏ వాణిశ్రీ, ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్త నాగస్వాతి, ఏవో సాయి దీక్షిత్, ఏఈవోలు, ప్రజా ప్రతినిధులు, రైతులు విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## కమిటీ అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలి ..మధిర డిపో వద్ద ఎస్ డబ్ల్యూ ఎఫ్ ధర్నా



మధిర జూలై 27 ప్రభాతవార్త

ఆర్టీసీ కార్మికుల సమ్మె సందర్భంగా యూనియన్ లతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీ చర్చించి అంగీకరించిన అంశాలను అమలు చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల వద్ద ధర్నా లకు ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ సంఘం పిలుపునిచ్చింది. ఈ క్రమంలో మధిర డిపో వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కొరకు కమిటీ వెంటనే నియమించాలని, అలవెన్సు లు 80 శాతం పెంచి తక్షణమే అమలు చేయాలని, బ్రెడ్ విన్నర్ స్కీమ్ లో అపాయింట్మెంట్ అయినా వారిని వెంటనే రెగ్యులర్ చేయాలనీ, జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాస్ అయిన వారందరికీ పోస్టింగ్ ఇవ్వాలని పనిభారం తగ్గించాలని, కార్మిక సంఘాలు తో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జె. పద్మావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, అధ్యక్షులు చంద్ర రావు కార్యదర్శి కోటయ్య, వెంకట్రామమ్మ, వెంకట లక్ష్మి, నాగరాజు, బండి శ్రీను, ఎల్విపి రెడ్డి, కందుల రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు

## కబడ్డీ అకాడమీకి ఎంపికైన మధిర క్రీడాకారులు

మధిర జూలై 27 ప్రభాతవార్త



మహబూబ్‌నగర్‌లోని శీతిగిబి రాష్ట్ర కబడ్డీ అకాడమీలో ఇటీవల నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో మధిర మినీ స్టేడియంకు చెందిన క్రీడాకారులు వి. లక్ష్మీ గణేష్ జె. ఉమేష్కుమార్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అకాడమీ కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి టి. సునీల్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులు సాధించిన ఈ విజయం వారి కఠోర శ్రమ, అంకితభావం మరియు నిరంతర సాధనకు నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించి జిల్లా, రాష్ట్రాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మధిర మినీ స్టేడియం ఇంచార్జ్ వై. చిన్ని మరియు కబడ్డీ కోచ్ ప్రవీణ్ కుమార్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణతో కూడిన సాధనను కొనసాగిస్తూ తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటే రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విశేష విజయాలు సాధించగలరని వారు పేర్కొన్నారు. మధిర మినీ స్టేడియం నుంచి ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర కబడ్డీ అకాడమీకి ఎంపిక కావడం పట్ల క్రీడాభిమానులు, తోటి క్రీడాకారులు, తల్లిదండ్రులు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం మధిర ప్రాంత యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చే ఘనతగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

## జూనియర్ కళాశాల విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం పంపిణీ

**హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాగి ఇడ్లీ, సాంబారు అందజేత**

బోనకల్, ప్రభాతవార్త :

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారి పోషకాహార స్థాయిని మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్పాహారంగా రాగి ఇడ్లీ, సాంబారు పంపిణీ చేశారు. విద్యార్థులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. రాగి వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను అందించడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగుపడి, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో ఇలాంటి పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో అ జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, తిరుపతి రావు, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ పాల్గొన్నారు

# బొగ్గు ఉత్పత్తి సాధనలో కార్మికుల సమిష్టి కృషి అభినందనీయం

**నిరంతర శ్రమ, అంకితభావంతోనే సంస్థ పురోగతి సాధ్యం**

**కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) షాలెం రాజు**



రుద్రంపూర్, జూలై 27 ప్రభాతవార్త: బొగ్గు ఉత్పత్తి సాధనలో కార్మికుల సమిష్టి కృషి అభినందనీయమని, ఉద్యోగుల నిరంతర శ్రమ, అంకితభావంతోనే సింగరేణి సంస్థ పురోగతి సాధ్యమవుతోందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) షాలెం రాజు తెలిపారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా కొత్తగూడెం ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం ఆయనకు అధికారులు, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కలిసి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం షాలెం రాజు మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌లో పనిచేసే టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, అధికారులు రాత్రింబవళ్లు కష్టించి పనిచేయడం వల్లే కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. అంతకుముందు జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. రామవరం ప్రాంతానికి చెందిన షాలెం రాజు అండర్ మేనేజర్‌గా ప్రస్థానం ప్రారంభించి, క్రమశిక్షణతో జీఎం స్థాయికి ఎదిగిన తీరు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువాలు, పూలమాలలతో వైభవంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారుల ప్రతినిధులు గోవింద రావు, రామకృష్ణ, క్రిస్టోఫర్, కార్మిక సంఘాల నాయకులు మధు కృష్ణ, సత్తార్ పాషా, గుమ్మడి వీరయ్య, మెంగని రోషన్ తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వనమహోత్సవం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 27 ప్రభాతవార్త:



జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెంలో సోమవారం సాయంత్రం గ్రంథాలయ ఆవరణంలో వన మహోత్సవం, శ్రమదానం కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన చెట్లు నాటడంతో పాటు శ్రమదాన కార్యక్రమాన్ని కూడా కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మొక్కలు నాటి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ... మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు విషపు పురుగుల నుంచి రక్షి ంచు కొని ఆరోగ్యంగా ఉండాలని విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మన పర్యావరణాన్ని మనమే పరిరక్షి ంచు కోవాలని వాతావరణం లో ఉన్న కాలుష్యాన్ని, వేడిని తగ్గించడానికి మన వంతు కృషిని చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతిరోజు క్రమం తప్పకుండా మొక్కలు నాటుతూ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రశంసలు అందుకున్న మొక్కల కె . ఎన్ రాజశేఖర్ శాలువాతో సత్కరించి అభినందించారు, ఇలా ఎన్నో మొక్కలు నాటాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 2 గ్రంథ పాలకురాలు సూరేపల్లి లలిత కుమారి , గ్రంథపాలకురాలు మణి మృదుల, గ్రంథాలయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి సకాలంలో పరిష్కారం చూపాలి

**ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి**

**వినతులపై నిరంతర పర్యవేక్షణతో ఫలితాలు సాధించాలి**

**జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 27 ప్రభాతవార్త: సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలిసి స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రతతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు . ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల నుంచి 8 కిలోల తరుగు పేరుతో రూ.71 లక్షల అవినీతి ఆరోపణ

**ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట తెలంగాణ రాష్ట్రీయ లోకల్ ధర్నా**

కొత్తగూడెం టౌన్, జూలై 27 ప్రభాతవార్త:



రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు సమయంలో క్వింటాకు 8 కిలోల చొప్పున తరుగు పేరుతో ధాన్యం కోత విధించి సుమారు రూ.71 లక్షల మేర అవినీతి జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్రీయ లోకల్ (టీఆర్ఎల్) ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రీయ లోకల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కట్టా సతీష్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి అన్యాయంగా 8 కిలోల తరుగు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు జరిగిన నష్టాన్ని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. సహకార సంఘాల్లో జరుగుతున్న అవకతవకలను అరికట్టడంతో పాటు రైతుల హక్కులను పరిరక్షి ంచాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రీయ లోకల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేజీ నరసింహారావు, టీఆర్ఎల్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కూరగంటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి. నరసింహారావు, జి. బీరప్ప, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాజ్‌కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విక్రమ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు పృథ్వి నాయక్, స్టూడెంట్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రూ.46 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ....**

**ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



ములకలపల్లి, జూలై 27 (ప్రభాతవార్త): గ్రామాల సమగ్ర అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, కుమ్మరిపాడు, గుట్టగూడెం పంచాయతీ పరిధిలోని మామిళ్లగూడెం, ములకలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సుమారు రూ.46 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రారంభించడంతో పాటు నూతన పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చాపరాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గుట్టగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ములకలపల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రూ.5,33,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ గ్రామాల్లో రహదారు లు, విద్యా సదుపాయా లు, గృహ నిర్మాణాలు వంటి అభి వృద్ధి పను లను వేగవంతం చే స్తు న్నా మ ని తెలిపారు. పేద ప్రజలకు ఆపద సమయంలో ముఖ్యమం త్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాహిర్, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, ఎస్ఐఆర్ మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి సత్యప్రసాద్, ములకలపల్లి సర్పంచ్ చంద్రలేఖ, పాలకుర్తి రత్నం, పేటేటి నరసింహారావు, అమర్‌నాథ్, కరుటూరి కృష్ణ, సుమిత్, సురభి రాజేష్, పాలకుర్తి రవి, బూరుగుపల్లి పద్మశ్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వనరులను పరిరక్షించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

ప్రభాతవార్త కలెక్టరేట్ జులై 27



ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు అయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నీటి వనరులను సంరక్షి ంచాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ సూచించారు. సోమవారం మధిర మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ పీఎస్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడడంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రాజెక్టులలో నీటి నిల్వలు కూడా క్రమంగా తగ్గుతున్నందున రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కంది, పెసర, మినుములు, జొన్నలు, సజ్జలు, మరియు కూరగాయల వంటి తక్కువ నీటితో సాగు అయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సులభంగా అందుబాటులో ఉండేలా జులై 27 నుంచి 29 వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 21 రైతు వేదికల్లో విత్తనమేళాలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ప్రతి మండలానికి ఒక రైతు వేదిక చొప్పున ఈ మేళాలను నిర్వహిస్తున్నామని, రైతులు తమకు సమీపంలోని రైతు వేదికను సందర్శించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూరియా నిలువలు సమృద్ధిగా ఉన్నాయి. వానాకాలం 2026 సీజనకు ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడిందని కలెక్టర్ తెలియజేశారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 231.77 మెట్రిక్ టన్నుల (5,150 బస్తాలు), సహకార సంఘాల వద్ద 2,292.25 మెట్రిక్ టన్నుల (50,938 బస్తాలు), మార్కె ఫెడ్ ఖమ్మం వద్ద 3,153,96 మెట్రిక్ టన్నులు (70,088 బస్తాలు), సి ఆర్ పి కమిషనర్ రిజర్వ్ స్టాక్లో 7,698.355 మెట్రిక్ టన్నులు (1,71,074 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991 మెట్రిక్ టన్నులు (22,022 బస్తాలు) అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొత్తం మీద 3,19,272 యూరియా బస్తాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. జిల్లాలో ఇప్పటివరకు యూరియా యాప్ ద్వారా 1,27,377 మంది రైతులు 3,90,762 బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 3,52,172 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులు అనవసరన ఆందోళన చెందకుండా సమీపంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల నుంచి అవసరమైన యూరియాను కొనుగోలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మధుర మార్కెట్ కమిటీ చైర్మన్ బందారు నరసింహారావు, సిపిఒ శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# కోసూరుకు నివాళులు అర్పించిన శెట్టి

ఖమ్మం అర్బన్, జులై 27(ప్రభాత వార్త )



ఇటీవల మరణించిన కాంగ్రెస్ నాయకులు మాజీ సుడా డైరెక్టర్కోసూరు రమేశ్ గౌడ్ వారి దశ దిన కర్మ కార్యక్రమముకు హాజరయ్యి కీర్తిశేషులు రమేశ్ కు నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు శెట్టి రంగారావు, నగర కార్యదర్శి సముద్రాల శ్రీనివాసరావు, కె కె సి చైర్మన్ సి హెచ్ విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు .అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.

# చిమ్మపూడి గ్రామంలో పలుచోట్ల సిసి రోడ్లు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ నర్సిరెడ్డి

రఘునాథపాలెం, ప్రభాతవార్త జూలై 27:



మండల కేంద్రం లోని చిమ్మపూడి గ్రామంలో పలుచోట్ల సీసీ రోడ్లు శరవేగంగా పనులు ప్రారంభించారు సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం లో సీసీ రోడ్లు మరియు మరెన్నో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు దానికి ప్రజలందరూ సహకరించాలని అదేవిధంగా వస్తున్న సీజన్ వ్యాధులు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారుఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తని తనే స్వయంగా గడ్డి మందు కొట్టించటం మొదలుపెట్టారుఎప్పటికప్పుడు గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ గ్రామ అభివృద్ధికి నేను తోడ్పడుతామని గ్రామన్ని బాగు చేయడంలో నేను ముందుంటానని ఈ సందర్భంగాఆయన తెలియజేశారు. గ్రామ సర్పంచ్ నర్సి రెడ్డి,కన్నం నరేష్,గుండ్ల సుజాత, సంగపొంగు రాము, పద్మ, రేణమ్మ ,అశోక్ , విష్ణుమూర్తి మరియుతదితరులు పాల్గొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి

## అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ఖమ్మం వైద్య విభాగం,జులై 27 (ప్రభాతవార్త)



క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ చట్టం2010 ప్రకారం వైద్య సంస్థల నమోదు, పునరుద్ధరణ ప్రక్రియలో నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ పాల్గొని జిల్లా లోని వైద్య సంస్థల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, నిబంధనల అమలు అంశాలపై సమీక్షి ంచారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ..వైద్య సంస్థలకు రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ మంజూరు చేసే ముందు ప్రతి ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలోని అన్ని నిబంధనలు తప్పనిసరిగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని, తనిఖీల్లో ఏవైనా లోపాలు గుర్తించినట్లయితే సంబంధిత ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, నిర్దిష్ట గడువులోగా వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు 47 ప్రొవిజనల్ సర్టిఫికెట్లు జారీ చేయగా, 9 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే 25 శాశ్వత సర్టిఫికెట్లు జారీ చేయగా, 4 దరఖాస్తులు తిరస్కరించబడి, 21 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మరో 12 దరఖాస్తులు ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం పోలీసు శాఖ వద్ద, 12 దరఖాస్తులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమావేశంలో వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్, ఏసిపి, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ., కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవోకు టీఎస్‌యూటీఎఫ్ వినతి

భద్రాచలం, జూలై 27( ప్రభాతవార్త ):



గిరిజన సంక్షేమ శాఖలోని ఉపాధ్యాయులు, పాఠశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో జీపీఎస్ పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం గ్రామపంచాయతీల ద్వారా చేపట్టాలని, దుమ్ముగూడెం మండలంలోని పలు జీపీఎస్ పాఠశాలలను ఏజీహెచ్‌ఎస్ గౌరారం పే సెంటర్ పరిధిలోకి మార్చాలని కోరారు. సీఆర్టీ ఉపాధ్యాయులను పనితీరు ఆధారంగా కాకుండా పాత విధానంలోనే కొనసాగించాలని, ఉపాధ్యాయుల కొరత నివారణ కోసం చేపట్టే వర్క్ అడ్జస్ట్మెంట్‌ను పారదర్శకంగా నిర్వహించి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే సీఆర్టీ ఉపాధ్యాయులకు కనీస టైమ్ స్కేల్ మంజూరు చేయడం, విధుల నుంచి తొలగించిన ఇద్దరు సీఆర్టీ ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం, పండిట్‌లు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌ను ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో కూడా అమలు చేయాలని కోరారు.ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటీ వార్డెన్ల స్థానంలో ప్రత్యేక హాస్టల్ వెల్ఫేర్ అధికారులను నియమించడం, విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం హెల్త్ ఎమర్జెన్సీ ఫండ్ ఏర్పాటు చేయడం, జీవో 56 ప్రకారం కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నాలుగు ఎస్‌జీటీ పోస్టులు రీడిప్లాయ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజు, జిల్లా అధ్యక్షుడు బి. మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఎస్. విజయ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ సబ్ కమిటీ కన్వీనర్ టీ. బాలు, దుమ్ముగూడెం మండల బాధ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు

# ఏ.పి.జె. అబ్దుల్ కలాం స్ఫూర్తి ప్రధత త్రివేణి లో ఘన అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

ఖమ్మం విద్యా విభాగం ప్రభాత వార్త:

పెద్ద కలలు కనండి వాటిని నిజం చేసుకునే వరకు నిరంతరం శ్రమించండి అనే డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం సందేశాన్ని విద్యార్థులకు చేరవేస్తూ, త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో సోమవారం డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రత్న డా. కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన చూపిన మార్గం ప్రతి విద్యార్థికి ఆదర్శమని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, డా. కలాం జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని, విజయం సాధించాలంటే పెద్ద లక్ష్యాలు పెట్టుకుని పట్టుదలతో శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రియదర్శిని లో "శ్రీనివాస మంగాపురం" సినిమా బృందం

ఖమ్మం విద్యా విభాగం జూలై 27, ప్రభాత వార్త:

ప్రియదర్శిని మహిళల ఇంజనీరింగ్ కళాశాల లో సోమవారం నూతన తెలుగు చిత్రం "శ్రీనివాస మంగాపురం" మూవీ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు గట్టమనేని జయకృష్ణ , దర్శకుడు అజయ్ భూపతి కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. చిత్ర విశేషాలను పంచుకుంటూ, సినిమా విజయవంతం కావడానికి విద్యార్థుల ఆశీర్వాదాలు, సహకారం కోరారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు ముఖ్య అతిథులను ఘనంగా ఆహ్వానిస్తూ, యువతకు నాణ్యమైన వినోదంతో పాటు విలువలను అందించే చిత్రాలు మరిన్ని రావాలని ఆకాంక్షి ంచారు. విద్యార్థులు సినీ ప్రముఖులతో ప్రత్యక్షంగా మమేకం కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బత్తుల గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ ఆట్లూరి వెంకటరమణ, వివిధ



విభాగాల అధిపతులు, అధ్యాపకులు,కల్చరల్ ఇన్‌చార్జ్ ఆర్. వి. ఎన్. ప్రసాద్, బోధనేతర సిబ్బంది, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొని అతిథులకు ఘన స్వాగతం పలికారు.

# చెత్తను వేరు చేద్దాం... పరిశుభ్రతను కాపాడుదాం.

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 27:**

పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రామచంద్రాపురం గ్రామ సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి అన్నారు. అశ్వాపురం మండలంలోని ఎంపియుపిఎస్ రామచంద్రాపురం పాఠశాలను సందర్శించిన ఆమె,విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణ పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వాతి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే చెత్తను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ వేయకుండా,తడి చెత్త-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తడి,పొడి చెత్తతో పాటు శానిటరీ వ్యర్థాలు,ప్రత్యేక జాగ్రత్తతో నిర్వహించాల్సిన ఇతర వ్యర్థాలను కూడా వేరుగా గుర్తించి,తగిన విధంగా పారవేయాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు వివరించారు. ఇంటి నుంచే పరిశుభ్రతకు శ్రీకారం



చుట్టాలని, విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు, ఇరుగు పొరుగు వారికి తెలపాలని సర్పంచ్ కోరారు. ముఖ్యంగా తడి చెత్త-పొడి చెత్తను వేరు చేయడం, శానిటరీ వ్యర్థాలను ప్రత్యేకంగా నిర్వహించడం వంటి అంశాలపై తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని,విద్యార్థులు మారితే కుటుంబాలు మారుతాయని,కుటుంబాలు మారితే గ్రామం పరిశుభ్రంగా మారుతుంది అని ఆమె పేర్కొన్నారు. చిన్న వయసులోనే పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుంటే భవిష్యత్‌లో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పరిశుభ్రత, వ్యర్థాల వేరు చేసే విధానం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తౌఫిక్ పాషా,వార్డు మెంబర్ అశోక్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం.

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 27:**

పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సోమవారం అశ్వాపురం మండలంలో పర్యటించి 42 లక్షల రూపాయల నిధులతో మంజూరైన,నిర్మాణం పూర్తిచేసుకున్న పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం,శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.అశ్వాపురం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల,బి.సి హాస్టల్ నందు మొత్తం 30 లక్షల నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వెంటనే పనులు మొదలు పెట్టి సత్వరమే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం చింతిర్యాల గ్రామపంచాయతీ



పరిధిలోని కట్టవారి గూడెంలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒరుగంటి రమేష్ బాబు,సీనియర్ నాయకుడు గాదె కేశవ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బరాజు సంపత్,సర్పంచ్ లు సబ్బా పిచ్చయ్య, కలివేటి సరిత, తెల్లం నాగమణి, యేనిక ఉషారాణి, కుంజా జాను, ఉప సర్పంచ్ లు మేకల అంజిబాబు, యెంక్కటి పున్నారెడ్డి,హర్షా నాయక్, శీలం సంజీవ రెడ్డి, నాయకులు బూరెడ్డి వెంకటరెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,వేములపల్లి రమేష్, లంకమల్ల కొండలరావు,బట్టా సత్యనారాయణ, ఎండి షరీఫుద్దీన్,ఆవుల రవి, సామకూరి వెంకన్న, ఎనిక రవి బాబు,రావులపల్లి నరసింహారావు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లే పార్టీకి పునాది:ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, జులై 27:**

కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ లెవెల్ ఏజెంట్లే బలమైన పునాది అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షురాలు దేవీప్రసన్న అన్నారు. సోమవారం మణుగూరు మండలంలో నిర్వహించిన పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం డీసీసీ







అధ్యక్షురాలు దేవీప్రసన్న మాట్లాడుతూ, బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అభయహస్తం పేరుతో దళితులను మోసం చేసిన ప్రభుత్వం.

**అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 27:**

అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ప్రభుత్వం దళితులను మోసం చేసిందని మండల బిఆర్ఎస్ అనుబంధ ఎస్ సి సెల్ అధ్యక్షుడు చల్లా రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ కార్యాలయంలో సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో దళితులకు 12 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా వీటి ప్రస్తావన లేకపోవడం చాలా విచారకరమన్నారు, నియోజకవర్గంలోని సుమారు10 వేల 300 కుటుంబాలు ఉన్న కాంగ్రెస్ పార్టీ దళితులను చిన్నచూపు చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అలవిగాని హామీలు ఇచ్చి మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన మాట నెరవేర్చక కాలయాపన చేస్తుందని,గత బిఆర్ఎస్ పార్టీ కేసిఆర్ ప్రభుత్వం లో అన్ని వర్గాల ప్రజలు ఒక సంతోషాలతో జీవిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ వర్గానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు. రైతులకు రైతుబంధు, మహిళలకు 2500, వృద్ధాప్య పెన్షన్లు 4000, వికలాంగులకు 6000, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 4000, సంవత్సరానికి 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థినులకు స్కూటీలు,కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, రైతులకు, కౌలుదారులకు,వ్యవసాయ కూలీలకు, ప్రతి ఒక్క వర్గానికి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్తారని రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ కేసిఆర్ నాయకత్వంలో ఘనవిజయం సాధించి అధికారం లోకి రావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గద్దల రామకృష్ణ, నజీర్ సోను,శెట్టిపల్లి శేఖర్,మురికిపూడి అశోక్, పవన్ పాల్గొన్నారు.





# సింగరేణి చెక్ పోస్ట్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి





**మణుగూరు, ప్రభాతవార్త,**

జులై 27:సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలోని సింగరేణి చెక్ పోస్ట్ వద్ద కార్మికులు, వాహనదారుల రక్షణ కోసం యాజమాన్యం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం రామ నరసయ్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి చెక్ పోస్ట్ ప్రాంతాన్ని నాయకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ బ్రిడ్జ్ వద్ద రోడ్డు పై ఉన్న చెక్ పోస్ట్ మీదుగా ప్రయాణించే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాల పరిస్థితులతో పాటు డస్ట్ నివారణకు వాటర్ స్ప్రే చేసినప్పుడు రోడ్డుపై బైకులు జారిపడుతున్నాయని, ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడి ప్రాణాపాయం నుండి బయటపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే చెక్ పోస్ట్ వద్ద సీలింగ్ పూర్తిగా డ్యామేజ్ కావడంతో డస్ట్ వల్ల సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షం వస్తే నీరు కారుతోందని అన్నారు. వెంటనే చెక్ పోస్ట్‌ను పటిష్టం చేసి, లోపల ఏసీలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి షిఫ్టుకు 100 నుండి 175 లారీలతో పాటు కంపెనీ, కార్మికుల వాహనాల రవాణాతో ఈ ప్రాంతం డేంజర్ జోన్‌గా మారిందని, యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల నాగరాజు, అదేర్ల సురేందర్, శనిగరపు కుమార్ స్వామి పాల్గొన్నారు

# నేడు సిపిఐ సమావేశం

**మణుగూరు, ప్రభాతవార్త, జులై 27:**

మణుగూరులోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అన్నారు. ఈ సందర్భంగా అయోధ్య స్మారక స్థూపం ఆవిష్కరణ, సిపిఐ ప్రజా చైతన్య యాత్రలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండల, పట్టణ కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, సహాయ కార్యదర్శులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ, మహిళా, గిరిజన, యువజన, ప్రజా సంఘాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, శాఖ కార్యదర్శులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# గ్రామంలో నేడు భూభారతి భూ సర్వే.
# రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**పినపాక, ప్రభాత వార్త, జులై 27.**

మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామపంచాయతీ పరిధిలో భూభారతి భూ సర్వే కార్యక్రమాన్ని నేడు ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సింధుజ తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో భూములు కలిగిన సంబంధిత భూ యజమానులు, రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు. భూ సర్వే



ప్రక్రియలో యాజమాన్య వివరాల నిర్ధారణ, భూ రికార్డుల పరిశీలన, అవసరమైన వివరాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. భూ యజమానులు తమకు సంబంధించిన పత్రాలతో నిర్ణీత సమయానికి హాజరై రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.

# విత్తన మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం

**టేకులపల్లి, ప్రభాతవార్త:**

టేకులపల్లి మండలం ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ రైతు వేదిక లో విత్తనమేళను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించి ఈ సందర్భంగా విత్తన మేళాను, ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల విత్తనాల స్టాళ్లను పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి





విత్తన మేళాలను నిర్వహిస్తోందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ, తమ ప్రాంతానికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీ కోరం కనకయ్య గారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఓ బాబురావు, ఏడిఏ లాల్ చంద్ ఏవో అన్నపూర్ణ ఏ ఈ ఓ లు లు, ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డు సర్పంచ్ బానోత్ పూల బంతి తదితరులు పాల్గొన్నారు.

# హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**ఇల్లందు అర్బన్, జూలై 27, ప్రభాతవార్త:**

హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇల్లందు హమాలి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. జిసిసి కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 అమలు చేసేలా జీవో జారీ చేయాలని, సమగ్ర చట్టం ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బొల్ల సీతారాములు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్, ట్రైల్ యూనియన్ అధ్యక్షులు బి. రాంసింగ్, పాయం




వెంకన్న పాల్గొని మాట్లాడారు. సివిల్ సప్లై, రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న గుమస్తా, ఆపరేటర్/మేస్త్రీ, దినసరి కూలీలు, బట్టీలపై పనిచేసే మహిళా కూలీలు, వాచ్‌మెన్లకు చట్టబద్ధమైన హక్కులు అమలు కావడం లేదన్నారు. రైస్, దాల్, ఆయిల్, ఫ్లోర్, విత్తనశుద్ధి, స్పిన్నింగ్, జిన్నింగ్, డిస్టిలరీస్, బ్రేవరీస్, మార్కెట్లు వంటి సంస్థల్లో పనిచేసే కార్మికులకు ఫ్యాక్టరీస్ యాక్ట్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, ప్రమాద నష్టపరిహార చట్టం, బోనస్ చట్టాలు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. 10 మంది కార్మికులు ఉన్న సంస్థలో ఈఎస్ఐ, 20 మంది దాటితే పీఎఫ్ వర్తించాలని, లేబర్ వెల్ఫేర్ ఫండ్ చెల్లించాలని, మస్టర్ రోల్స్ పాటించాలని డిమాండ్ చేశారు. కానీ యజమానులు ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని, అమలు చేయాల్సిన ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుండగా చాలీచాలని వేతనాలతో మిల్లు, హమాలి కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిశీలించి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో హమాలి యూనియన్ నాయకులు మోటం సంపత్, వార శ్యామ్, రాజశేఖర్, భాగ్య, శీను, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సర్వేపై ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మిక తనిఖీ

**ఇల్లందు అర్బన్, జూలై 27, ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా నమోదు, సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఇల్లందు పట్టణంలోని 22, 24వ వార్డుల్లో బి ఎల్ ఎ లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేలో ఎమ్మెల్యే పాల్గొని, బి ఎల్ ఎ లు నింపుతున్న ఎస్ ఐ ఆర్ ఫార్మ్‌లను, ఓటర్ల వివరాల నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, బి ఎల్ ఎ లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనీ సూచించారు. ప్రతి ఇంటినీ సందర్శించి కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో తప్పుల



సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ఫార్మ్ నింపడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని బి ఎల్ ఎ, బి ఎల్ ఓ ల ను హెచ్చరించారు. వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ మాట్లాడుతూ తమ వార్డులో ఓటర్ల నమోదు ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అర్హులందరికీ ఓటు హక్కు అందేలా బి ఎల్ ఎ ల సర్వేను నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకె ళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, 7వ వార్డు కౌన్సిలర్ రాజు గౌడ్, కో ఆప్షన్ మడుగు సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియల్, చిల్లా శ్రీనివాస్, ఆలేటి చిన్ని, పొట్ల శీను, సిహెచ్. రమేష్, బి ఎల్ ఎ లు కోలపురి ఝాన్సీ, సందీప్, బి ఎల్ ఓ లు అజ్మీర సక్కుబాయి, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

# నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలి.

**పినపాక, ప్రభాత వార్త, జులై 27.**

శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలని ఎంఈఓ కొమరం నాగయ్య అన్నారు. జులై 21 నుంచి మండల కేంద్రంలో గల జెడ్ పి హెచ్ పాఠశాలలో రెండు విడతలుగా ఆరు రోజుల పాటు కొనసాగిన ఇన్ సర్వీస్ ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు రోజైన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ



తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు సులభ బోధన పద్ధతులతో పాటు రెమిడీయేషన్ తరగతుల నిర్వహణ తదితర శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, రిసోర్స్ పర్సన్ లు రాజేశ్వరరావు, కృష్ణయ్య, బాబురావు, షాలిని, సిఅర్పి లు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి లక్ష్యంగా పనిచేయాలి

## ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, ప్రభాతవార్త:**

టేకులపల్లి మండలం ప్రేగళ్లపాడు గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నూతన మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం గ్రామ స్థాయి నుండే నిర్మించాలని ముఖ్య కార్యకర్తల సమావేశంలో విషయాన్ని ఉద్దేశం చేశారు వర్షం వచ్చిన లెక్కచేయకుండా కార్యకర్తలలో మాట్లాడి జోష్ నింపారు అనంతరం లక్కినేని శ్యామ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# కెనాల్ కట్టలపై ఇసుక రవాణా ను అడ్డుకుంటాం.

**అశ్వాపురం, ప్రభాతవార్త, జులై 27:**

సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కెనాల్ కరకట్టలపై జరిగే ఇసుక రవాణా అడ్డుకుంటామని అమ్మగారి పల్లి గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధి నేలపట్ల కోటి రామిరెడ్డి అన్నారు. కెనాల్ కరకట్టలపై ఇసుక లారీల రాకపోకల వల్ల కరకట్ట కుంగిపోతుందని, ధ్వంసం అవుతుందని, ఈ క్రమంలో లారీలు కెనాల్ పై రైతుల కోసం, పశువుల రాకపోకల కోసం నిర్మించిన పాసింగ్ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్నాయని, ఈ క్రమంలో ఒక బ్రిడ్జి శిథిలమవుతున్న పరిస్థితుల్లో ఉందని అన్నారు. ఈ ప్రాంత రైతుల భూములు త్యాగం చేసి సీతారామ ప్రాజెక్టుకు భూములు ఇచ్చామని, ఇసుక రైసింగ్ కాంట్రాక్టర్ మా కళ్ళముందే కాలువ కరకట్టల మీద ఉన్నటువంటి సిల్ట్ ను భారీ యంత్రాల సహాయంతో కెనాల్ లోకి నెడుతున్నాడని, ఈ సంఘటనపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోహన్ రెడ్డి, నేలపట్ల రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన వైదికలను సన్మానించిన ఎమ్మెల్యే



**భద్రాచలం, జూలై 27:ప్రభాతవార్త**

భద్రాచలం పట్టణంలోని చిన్న స్వామీజీ మఠం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రామాలయంలో నియమితులైన అర్చకులు, ఆలయ సిబ్బందిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో అర్చకులు, సిబ్బంది నిబద్ధతతో సేవలందించాలని ఆకాంక్షించారు. భక్తులకు ఉత్తమ సేవలు అందిస్తూ ఆలయ ప్రతిష్ఠను మరింత పెంపొందించాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# వరికి బదులు ప్రత్యామ్నయం పంటల పై దృష్టి సారించండి

**పప్పు దినుసులు సాగుకు ఎంచుకోవాల్సిన అవసరం ఉంది**

**జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య వెల్లడి**

*నేలకొండపల్లి, జూలై 27 (ప్రభాతవార్త):*

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల పై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య వెల్లడించారు. సోమవారం నేలకొండపల్లి లోని రైతు వేదిక నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ విత్తన మేళా సందర్భంగా దనసరి పుల్లయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి పంటకు దూరంగా ఉండాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పప్పు దినుసులను రైతులు సాగు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఆరుతడి పంటలకు రైతులు సబ్సీడీ పై విత్తనాలు ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా రైతులు కోరుతున్నారని, ఆ విషయం ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.



రైతులను చైతన్యం చేసేందుకు ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. బోరుబావులను నమ్ముకుని వరి సాగు చేసి రైతులు నష్టపోకూడదన్నారు. భూగర్భజలాలు అడుగంటుతున్నాయని అన్నారు. ఎట్టి పరిస్థితులలో సాగుకు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు. ఒక పక్క నీటి కొరత, మరో పక్క విద్యుత్ సమస్య వెంటాడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితులను రైతులు అవగాహన చేసుకుని పప్పు దినుసులు, తక్కువ నీటి శాతం అవసరం ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. జిల్లాలో 12 మండలాలలో సాధారణ వర్షపాతం ఉందన్నారు. అందులో 7 మండలాలలో తక్కువ వర్షం పడగా అతి తక్కువగా కూసుమంచి మండలంలో 60 శాతం, ఎర్రుపాలెం 71 శాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఒక రైతు వేదిక లో విత్తనమేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్ కుమార్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, స్థానిక మండల వ్యవసాయాధికారి యం.రాధ, రైతు ప్రతినిధులు మేకల వెంకటేశ్వర్లు, గరిడేపల్లి రామారావు, విత్తన డీలర్లు గెల్లా వెంకటేశ్వరరావు, రామారావు, గెల్లా రామ్మోహనరావు, జి.వి. రామారావు, వ్యవసాయ విస్తీరణాధికారులు అరవింద్. దుర్గాభవాని పాల్గొన్నారు.

## భూగర్భజలాల పెంపునకు ప్రణాళికలు

*నేలకొండపల్లి, జూలై 27 (ప్రభాతవార్త)*

భూగర్భజలాల పెంపునకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య వెల్లడించారు. జలసిరి కార్యక్రమం పై సోమవారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం నందు ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఎల్నినో ప్రభావం భవిష్యత్ లో ఇలాంటి విపత్తు నుంచి గట్టెక్కేందుకు వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టాల్సిందేనన్నారు. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, పంట కుంటలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాల్సిందేనన్నారు. నీటి సంరక్షణ చేపట్టేలా ప్రత్యేక కార్యచరణ రూపకల్పన చేసుకోవాలని ఆయన చెప్పారు. వర్షపు నీటిని వృధా కాకుండా భూమిలోకి ఇంకడం వలన భూగర్భజలాలు గణనీయంగా పెరుగుతాయని అన్నారు. ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించి ఇంకుడు గుంతలు నిర్మించేలా కౌన్సిలింగ్ చేయాలని ఆయన సూచించారు. ఆగస్టు 15 లోపు పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అని చెప్పారు. జలసిరి విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి మండల పంచాయతీ అధికారి యం. శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

*నేలకొండపల్లి, జూలై 27 (ప్రభాతవార్త):*

ఆగస్టు 10వ తేదీన జరుగునున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కేవీ రామిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. పేద ప్రజలకు నష్టం చేసే విబిజీ రాంజీ బిల్లును, రైతులకు నష్టం చేసే విద్యుత్తు సరళీకరణ బిల్లును, అసంఘటిత రంగ కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం నేలకొండపల్లి లోని రావెళ్ళ సత్యనారాయణ భవనం నందు ఆ సంఘం నాయకులు రచ్చా నరసింహారావు అధ్యక్షతన తెలంగాణ వ్యవసాయ



కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సిఐటియు మండల సంఘంల సదస్సు జరిగింది. ఈ సదస్సులో కె.వి. రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ విబిజీ రాంజీ బిల్లులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు 60 శాతం, 40 శాతం సమీకరణలలో రాష్ట్రాలకు భారంగా ఉందని, ఈ పథకం నుండి రాష్ట్ర ప్రభుత్వం వైదొలగాలని, కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రధానంగా హమాలీలకు వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరళీకరణ ముసాయిదా చట్టాన్ని, రైతులకు నష్టం చేసే అమెరికా వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలని వారు చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల ఆగస్టు 10వ తేదీన జరువ తలపెట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని కార్మికులందరూ ఐక్యంగా కదలి వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేలకొండపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు దుగ్గి నరసింహారావు, పెదపాక మల్లేశ్వరరావు, సిఐటియు నాయకులు గాల్లపాటి జ్యోతి, బి.కోటేశ్వరి, రైతు సంఘం మండల అధ్యక్షులు ఇంటూరి అశోక్ కుమార్, భూక్య కృష్ణ, రావెళ్ల సుదర్శన్ రావు, ఏలూరి కోదండ రామారావు, కాలువ కోటేశ్వరరావు, ఎన్.జ్యోతి, భూక్య విజయ, కొత్తూరు వెంకటాచారి, ధీరావత్ నాగేశ్వరరావు, పి.నారాయణ, పి.శివరాజు, సామల మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యువత మారితేనే దేశ భవిష్యత్తు మారుతుంది-

**ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి వెల్లడి**

*నేలకొండపల్లి, జూలై 27 (ప్రభాతవార్త):*

యువత మారితేనే దేశ భవిష్యత్తు మారుతుందని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి దురలవాట్లకు యువత దూరంగా ఉండి, భగత్‌సింగ్ ఆశయాలతో పోరాట స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఆయన చెప్పారు. భైరవునిపల్లి గ్రామం నందు ఏఐవైఎఫ్ 22వ మండల మహాసభ జరిగింది. ఈ సభలో మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, విద్యా సమస్యలపై యువత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమించాలని సూచించారు. ఎన్‌టీఏ రద్దు, ఎన్‌ఈపీ-2020 ఉపసంహరణ, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని డిమాండ్ చేశారు. మహాసభ అనంతరం ఏఐవైఎఫ్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడుగా ఆలేటి ఉమామహేష్, ప్రధాన కార్యదర్శిగా పాలపాటి అశోక్, సహాయ కార్యదర్శిగా పెదపాక నాగరాజు, ఉపాధ్యక్షుడిగా గోపినాథ్ తో పాటు మరొక 19మంది కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చింతల రమేష్, మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు సహాయ కార్యదర్శి భద్రజీ వెంకటేశ్వరరావు, సిపిఐ సీనియర్ నాయకులు కనకబండి రామయ్య,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# విత్తన మేళా సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి పుల్లయ్య**

*కూసుమంచి జూలై 27 (ప్రభాతవార్త ) :*

విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి పుల్లయ్య సూచించారు. ఖమ్మం జిల్లా కుసుమంచి రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై రైతులతో ముఖాముఖి సమావేశమై ప్రస్తుత



వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై వివరించారు.ఈ సందర్భంగా రైతులకు పెసర, కంది వివిధ కూరగాయల విత్తనాలను ప్రదర్శించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ వ్యవధిలో అధిక దిగుబడి ఇచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు.రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారి వాణి , వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ వెల్లడి

*నేలకొండపల్లి జూలై 27 (ప్రభాతవార్త):*

భారతదేశపు మిస్సైల్ మ్యాన్ గా డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం పేరొందారని నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ వెల్లడించారు. సోమవారం నేలకొండపల్లి లోని బిజెపి పార్టీ కార్యాలయం నందు మండల బిజెపి మైనారిటీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ మోహినుద్దీన్ ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాంవర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం చిత్రపటానికి బిజెపి పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం సేవలను కొనియాడారు. డాక్టర్ అబ్దుల్ కలాం భారత రాష్ట్రపతి పదవికి ముందు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో,శ్రీఐఐ)లో ఏరోస్పేస్ ఇంజనీర్ గా పనిచేసారని ఆయన చెప్పారు. సాంకేతికత అభివృద్ధికి చేసిన సేవలను, కృషిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్. షరీఫుద్దీన్, మండల బిజెపి నాయకులు సూరేపల్లి జ్ఞాన రత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పిట్టల సూరిబాబు, జెల్లా సురేష్, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మానవ వనరుల సృష్టే ప్రజా ప్రభుత్వ సంకల్పం

**మూడు నెలల్లో రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం**

**అధికారం అంటే హోదా పెత్తనం కాదు సమాజ హితం కోసం పని చేయడం**

**పీపుల్స్ మార్చ్ స్ఫూర్తిగా రాష్ట్రంలో నిర్ణయాత్మకమైన పాలన మార్పులు**

**విద్యార్థులు యువత అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి ఎదగాలి**

**ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు సంక్షేమానికి డోకా లేదు**

**మధిరలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహార విందు ప్రారంభ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



మధిర జూలై 27 ప్రభాతవార్త

రాష్ట్రంలో భవిష్యత్తు మానవ వనరుల ను సృష్టించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి సారించి ముందుకు సాగుతున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీఎం అల్పాహార విందు పథకాన్ని ఆయన మధిర లో ప్రారంభించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో హరే రామ స్పిరిచువల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సెంట్రలైసెడ్ కమ్యూనిటీ కిచెన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాలలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు చేయడమే కాకుండా ఆరోగ్యకరమైన సమాజాన్ని తెలివైన మానవ వనరులను సృష్టించడం కూడా రాష్ట్ర దేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. విద్య రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా రాబోయే తరాలకు మేలు జరుగుతుం దన్న సంకల్పంతో కోట్ల రూపాయలను వెచ్చించి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠ శాలతో పాటు తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మాణం చేపడుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వెసులుబాటు లేకున్నప్పటికీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహ్నార ను ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేబినెట్ సహచరుల సమిష్టి నిర్ణయంతో బడ్జెట్లో విధులు కేటాయించామని అన్నారు. ఈ పథకాన్ని అమలుపై ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రులమంతా లక్ష్యం సాధించే దిశగా అడుగులేసామని అన్నారు. ఈ పథకం అమలుపై అనేక సందేహాలు విమర్శలు వెలువెత్తయని అయినప్పటికీ ప్రభుత్వ సంకల్పం ప్రజాహితం కోసం చేస్తున్నది కాబట్టి అన్ని వనరులు సమకూర్చుకొని పథకాన్ని మొదలుపెట్టి అమలు చేశామని అన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు మరో మూడు నెలలలో పూర్తిస్థాయిలో నాణ్యతతో కూడిన అల్పాహారాన్ని మూడు రోజులు పాలు మరో మూడు రోజులు రాగి జావా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మధిరలో ఏర్పాటుచేసిన కిచెన్ ద్వారా 16 మండలాలలోని 55 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలల్లో ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన అల్పాహారం భోజనాన్ని అందించేందుకు యోచిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో తాను సీఎల్పీ లీడర్గా నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర రాష్ట్ర ముఖ్యమంత్రి పిసిసి అధ్యక్షునిగా ఎన్నికల ముందు రాష్ట్రంలో చేపట్టిన పాదయాత్రలు స్ఫూర్తిగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వపరంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై నిర్మాణాత్మకమైన మార్పులు తీసుకురావాలని అనుకున్నామని ఆ లక్ష్యంతోనే ప్రణాళిక ప్రకారం క్యాబినెట్ సమిష్టి నిర్ణయంతో పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజలు తమను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుని చట్టసభలకు పంపించడం ద్వారా ప్రస్తుతం ప్రజలకు అవసరమైన పాలన నిర్ణయాలను తీసుకుంటున్నామని ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు రాష్ట్రంలో ఈ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారం అంటే హోదా కాదని పెత్తనం అంతకంటే కాదని సమాజ హితం కోసం బాధ్యతాయుతంగా పనిచేయడమే ప్రజా ప్రతినిధి లక్ష్యం అని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ప్రధానంగా విద్య వైద్య రంగాలను బలోపేతం చేయడం తద్వారా ప్రజలందరికీ ఆ సేవలు సద్వినియోగం అయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవానికి సొంతింటి కలను సహకారం చేయాలని తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ గృహాలను మంజూరు చేశామని రాష్ట్రంలో రైతన్నలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్సు ఇచ్చి కొనుగోలు చేశామని మహిళలకు 2 1/2 ఏళ్లలో 65 వేల కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు అందించమని ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసి ప్రతినెలా ఆర్టీసీకి టికెట్ల సొమ్ము చెల్లిస్తున్నామని గృహ జ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తున్నామని ఆరోగ్యశ్రీని పది లక్షలకు పెంచామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఉచితాలు కావని అవి భవిష్యత్తు మానవ వనరులు ఆర్థిక సృష్టికి దేశ తలసరి ఆదాయాన్ని పెంచేందుకు పెడుతున్న పెట్టుబడి మాత్రమేనని, ఈ ఫలాలు రాష్ట్ర దేశ అభివృద్ధి పునాదులుగా దోహదపడతాయని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పెడుతున్న పెట్టుబడి ఫలాలను యువత విద్యార్థులు అందిపుచ్చుకొని ఉజ్వలమైన మానవ వనరులుగా ఉన్నత స్థితికి ఎదిగి రాష్ట్ర దేశ భవిష్యత్తు నిర్మాణంలో తమ వంతు పాత్ర నిర్వహించి స్ఫూర్తిగా నిలిచేందుకు సిద్ధం కావాలని ఆ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ స్కీం అమలుపై తాను కూడా సందేహం వ్యక్తం చేశానని కానీ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం అయ్యే దిశగా అల్పాహారం అందించే కార్యక్రమం అమలు కావడం పట్ల మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

హరే రామ ఫౌండేషన్ చైర్మన్ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ సంకల్పానికి తమ వంతు బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించడం గర్వంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని నిర్ణీత సమయంలో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ కౌంతేయ స్వామీజీ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సింగరేణి జీఎం అనిల్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వర రావు మున్సిపల్ చైర్ పర్సన్ సామినేనిసుజాత వైస్ పర్సన్ కోనదని కుమార్ ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మూగబాలల భవిష్యత్తుకు 'వికాసం' వెలుగు..!

**ఉట్నూర్ మోడల్‌తో భద్రాచలంలో ప్రత్యేక పాఠశాల**

**17 మంది నుంచి 74 మందికి చేరిన విద్యార్థుల సంఖ్య**

**10వ తరగతి వరకు పెంచేయందుకు ప్రతిపాదనలు**

**గిరిజనులకు 70శాతం, ఇతరులకు 30శాతం ప్రవేశాలు**

**దివ్యాంగ చిన్నారులకు విద్యతో పాటు సంపూర్ణ సంక్షేమం**

భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త:

దివ్యాంగ చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు సంక్షేమాన్ని ఒకే వేదికపై అందించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన వికాసం ప్రత్యేక బాలల పాఠశాల (గిరిజన సంక్షేమ శాఖ) భద్రాచలంలో ఆశాజనకంగా ముందుకు సాగుతోంది. ఐటీడీఏ ఉట్నూర్‌లో విజయవంతంగా నడుస్తున్న ప్రత్యేక పాఠశాలను ఆదర్శంగా తీసుకుని, అన్ని వర్గాల దివ్యాంగ బాలలకు విద్యా అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో 2022,23 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలను ప్రారంభించారు.





**ప్రతిపాదన నుంచి కార్యరూపం వరకు...**

ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (డీడీ) సహకారంతో 2020లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, అనుమతులు లభించడంతో భద్రాచలం కేంద్రంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ విశాల భవనంలో పాఠశాల ప్రారంభమైంది. మూడేళ్లలో నాలుగు రెట్లు పెరిగిన చేరికలుప్రారంభంలో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు కేవలం 17 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాల ప్రస్తుతం 9వ తరగతి వరకు విస్తరించి 74 మంది విద్యార్థులతో కొనసాగుతోంది. రాష్ట్రంలో ఉట్నూర్ తర్వాత భద్రాచలంలోనే ఈ తరహా ప్రత్యేక పాఠశాల ఉండటంతో ప్రతి ఏడాది చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయి. 10వ తరగతికి ఉన్నతీకరణ దిశగా అడుగులుప్రస్తుతం 9వ తరగతి వరకు బోధన జరుగుతుండగా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 10వ తరగతి వరకు ఉన్నతీకరించేందుకు ఐటీడీఏ భద్రాచలం ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే దివ్యాంగ విద్యార్థులు మధ్యలో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. విద్యతో పాటు సంక్షేమానికీ పెద్ద ఆశ్రమ పాఠశాలల తరహాలో ఆహారం, మెనూ, విద్యా సామగ్రి, ఇతర సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు సమగ్ర సంక్షేమం అందిస్తున్నారు. ఉపాధ్యాయుల గౌరవ వేతనాలు, నిర్వహణ ఖర్చులు కూడా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ప్రవేశాల్లో గిరిజనులకు 70 శాతం, ఇతర కులాలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. డెప్యూటేషన్‌పై హెచ్‌ఎంగా అరుణకుమారి ప్రస్తుతం ఆశ్రమ పాఠశాల నుంచి డెప్యూటేషన్‌పై వచ్చిన గజిటెడ్ సీనియర్ ప్రధానోపాధ్యాయురాలు జి. అరుణకుమారి వికాసం ప్రత్యేక బాలల పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్**

లక్ష్మీదేవిపల్లి, జూలై 27 ప్రభాతవార్త



జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, వార్డులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, రోగులు ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచే ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని తనిఖీ చేశారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తనిఖీ అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల అభిప్రాయాలను తెలుసుకొని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటు లో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట లక్ష్మీదేవిపల్లి తాసిల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

### జైల్ భరోను జయప్రదం చేయండి

### సిపిఎం నేతనున్న

*కారేపల్లి జులై 27 ప్రభాతవార్త*

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజా ఉద్యమాలతోనే సాధ్యపడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మున్నా నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి లో సోమవారం సిపిఎం మండల కమిటీ శాఖ కార్యదర్శుల సమావేశం రేగళ్ల మంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూకార్మిక కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జంతర్ మంతర్ లో జరిగిన విద్యార్థి యువత ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే విధంగా ప్రజా ఉద్యమాలు జరగాలని అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు కు ఎంతో నష్టం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని అప్పుడే కార్మికుల హక్కులు కాపాడబడతాయని ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను కార్పోరేట్ల దోపిడీకి కార్మికులను గురి చేయడం దుర్మార్గమని ఇది ప్రజా ప్రభుత్వం కాదని భారత రాజ్యాంగాన్ని అనుసరించి పాలించే చట్టబద్ధ ప్రభుత్వం కాదని విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేరు మార్చి 125 పని దినాలనే పేరుతో 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు అనే పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి ప్రజల ఉపాధిని దెబ్బతీస్తున్నదని దీనిలో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ ఇతర పేదలు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. రైతు నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులు నడ్డి విరిచి వారి పోరాటానికి బెదిరిపోయి క్షమాపణలు చెప్పి నల్ల చట్టాలు రద్దు చేస్తూ చెప్పిన కనీసం మద్దతు ధర చట్టం ఇంతవరకు చేయలేదని ఇది రైతులను మోసం చేయడమేనని అది కాకుండా కొత్తగా రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రీఛార్జ్ రూపంలో నీరు వాడుకొని రైతులపై పన్ను భారాలు వేయడానికి విద్యుత్ చట్టాన్ని తెస్తున్నదని ఇది ముమ్మాటికి రైతు నల్ల చట్టాల అమలులో భాగమేనని ఈ సమస్యల వల్ల భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆ విధానాలను వెనుకకు తీసుకునే విధంగా ఆగస్టు 10న జరగనున్న జైలు భరో కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని నున్న నాగేశ్వరరావు పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, మండల ఇన్చార్జ్ కొండబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కే నరేంద్ర, డివిజన్ కమిటీ సభ్యులు సభ్యులు వజ్జా రామారావు, కొండబోయిన ఉమావతి, మండల కమిటీ సభ్యులు ఎండి ఇస్మాయిల్, కేసగాని ఉపేందర్,ముండ్ల ఏకాంబరం ,అజ్మీర్ శోభన్ బాబు, కల్తి రామచంద్రరావు, జి వెంకన్న, సీనియర్ నాయకుడు తుమోజు రామ్మూర్తి, కరపటి సీతారాములు, ఎజురత్నం, శాఖ కార్యదర్శి సురభాకసు ర్వయ్య, బానోత్ కిషన్,దార్ల బాబు,శేఖర్, మండల సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



## వార్త 30 ఏళ్ల విశ్వసనీయ ప్రస్థానానికి కలెక్టర్ ముద్ర

**ప్రజా సమస్యలను వెలికితీస్తూ పాలన,ప్రజల మధ్య వారధిగా వార్త**

**30వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

*యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:*

ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వానికి ,ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న ఖివార్తఖి దినపత్రిక జర్నలిజం రంగంలో విశిష్ట సేవలు అందిస్తోందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కొనియాడారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖివార్తఖి 30వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాటా డుతూ, మూడు దశాబ్దాలుగా ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ నిజాయితీ, నిష్పాక్షి కతతో వార్తలను అందించడం అభినందనీయమన్నారు. ప్రజల సమ స్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక భూమిక పోషిస్తుందని, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ య్యేలా వార్తా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడుతుందన్నారు.సమాజ ప్రయోజ నాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యలపై నిరంతరం కథనాలు ప్రచురిస్తూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న ఖివార్తఖి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షి ంచారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు కే. వెంకా రెడ్డి, ఏ. భాస్కర్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి టి. నాగిరెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా స్థాయిలోని వివిధ శాఖల అధికారులు,వార్త యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో పురుగుల మల్లేశం, పాత్రికేయులు ఆరుముళ్ల సుదర్శన్, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉప్పల రమేష్, దేవరపల్లి శ్రీనివాస్ రెడ్డి, మక్తాలజగన్, పొన్నగానిజహంగీర్, తాళ్లపాక మహేష్ , కుళ్ళ సిద్ధులు, వేణుగోపాలాచార్యులు, చామల మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.

**ప్రజావాణిలో 98 దరఖాస్తులు స్వీకరణ.**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.**

*సూర్యాపేట, జులై 27, ప్రభాతవార్త:*

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలో స్వీకరించే అన్ని ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేస్తూ, వాటి పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు.రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవతో తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను నిరక్ష ్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరిస్తే ప్రజలకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం తగ్గి ఇబ్బందులు నివారించవచ్చని ఆయన అన్నారు.ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 98 దరఖాస్తులు అందాయి. వాటిలో భూ సమస్యలకు సంబంధించినవి 60, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు 11, పంచాయతీరాజ్ శాఖకు 6, వైద్య, ఆరోగ్య శాఖకు 5, ఇతర శాఖలకు సంబంధించినవి 16 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. అన్ని దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, సత్వర పరిష్కారానికి చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శిరీష, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో పాటు వివిధ శాఖల జిల్లా



## మాదకద్రవ్యాల నియంత్రణపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైమ్, జూలై 27 ప్రభాతవార్త



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా పోలీసు అధికారులతో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి పై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ... జిల్లాలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన దర్యాప్తులో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి, సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి త్వరితగతిన ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా విచారణ చేపట్టాలని సూచించారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి ప్రత్యేక బృందాల ద్వారా వెంటనే అరెస్టు చేయాలని, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో పాల్గొనే వ్యక్తుల ఆర్థిక లావాదేవీలు, అక్రమంగా సంపాదించిన ఆస్తులపై సమగ్ర ఆర్థిక దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, జిల్లాలోని సీఐలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సాగదీత ఇంకెన్నాళ్లు..!

**సర్దుబాట్ల ఫైల్ అధికారుల టేబుళ్ల మధ్యే చెక్కర్లు**

**595 ఖాళీలతో విలవిల్లాడుతున్న విద్యాశాఖ.**

**మూతపడిన పాఠశాలల్లోనూ టీచర్లు.**

**విద్యార్థులున్న చోట గంపగుత్త బోధన**

*యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త*

:జిల్లాలో ప్రభుత్వ విద్యావ్యవస్థలో నెలకొన్న అసమతుల్యత మరోసారి బహిర్గతమైంది. ఒకవైపు వందలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు ఒకే తరగతి గదిలో గంపగుత్తగా చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొనగా, మరోవైపు విద్యార్థులే లేని పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొనసాగుతుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. నెలలుగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తున్నప్పటికీ, ఫైళ్లు మాత్రం అధికారుల టేబుళ్ల మధ్యే తిరుగుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.ఇప్పటికే తొలి విడతగా సుమారు 50 మంది ఉపాధ్యాయులతో సర్దుబాటు జాబితా సిద్ధమైనట్లు సమాచారం. అయితే ఆ జాబితా విడుదలపై ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో ఉపాధ్యాయుల్లోనూ, విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా సర్దుబాట్లు పూర్తి కాకపోవడంతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ పరిస్థితికి నిదర్శనంగా గుండాల మండలం పెద్దపడిశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిలిచింది. దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేసి మంచి ఫలితాలు సాధించిన ఈ పాఠశాల ప్రస్తుతం విద్యార్థులు లేక మూతపడిన పరిస్థితి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో విద్యార్థులు లేకపోయినా అక్కడ పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అయినప్పటికీ నిర్ణయం ఆలస్యం కావడం ప్రశ్నలు రేకెత్తిస్తోంది.జిల్లా విద్యాశాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 3,362 ఉపాధ్యాయ పోస్టులు మంజూరై ఉండగా ప్రస్తుతం కేవలం 2,767 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 595 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఎస్‌జీటీ పోస్టులే ఖాళీగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 1,366 ఎస్‌జీటీ పోస్టులకు గాను కేవలం 1,015 మంది మాత్రమే పనిచేస్తుండటంతో 351 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్ గణితం19, ఫిజికల్ సైన్స్8, బయోసైన్స్27, సోషల్46, ఇంగ్లీష్26, తెలుగు38, హిందీ28 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.ఖాళీల కారణంగా జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు రెండు, మూడు తరగతులకు ఒకేసారి బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. మరోవైపు కొద్ది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో మాత్రం ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు కొనసాగుతుండడం వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది.జిల్లాలో ప్రస్తుతం 735 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 45,034 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.